


# భారత్ ప్రతినిధి

తెలుగు దిన పత్రిక








సంపుటి: 3 సంచిక: 274 పేజీలు: 8 సంపాదకులు: రోళ్ళ రఘునాథ్ రెడ్డి ప్రచురణ: గుంటూరు మంగళవారం, 28 జూలై 2026 వెల: 2 రూ/- RNI No: APTEL/2023/88990

VOLUME: 3 ISSUE: 274 PAGES: 8 EDITOR: ROLLA RAGHUNATH REDDY PUBLISHED: GUNTUR TUESDAY, 28 JULY 2026 PRICE: 2 Rs/- BHARATH PRATHINIDHI




2లో..

## తక్కువ ధరలకే నాణ్యమైన బియ్యం

ఆగస్ట్ 1 నుంచి రాష్ట్రంలో అమలు

డిసప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ వెల్లడి




2లో..

## కృష్ణా జలాల్లో వాటాకు ఎపి డిమాండ్

బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పును సవాల్ చేసిన ఎపి

విచారణను సెప్టెంబర్‌కు వాయిదా వేసిన సుప్రీం



# ఉత్తరాంధ్ర గ్రోత్ ఇంజన్‌గా భోగాపురం ఎయిర్‌పోర్టు

### విమానాశ్రయ ప్రారంభోత్సవంపై సిఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి: భోగాపురం ఎయిర్ పోర్టుతో ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు వచ్చినట్లు అవుతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఉత్తరాంధ్ర ఆర్థిక, పారిశ్రామిక, పర్యాటక రంగాలకు గ్రోత్ ఇంజిన్‌గా భోగాపురం మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. సోమవారం రాజధాని అమరావతిలో భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవంపై ఏపీ సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 1వ తేదీన ప్రధాని మోదీ చేతుల మీదుగా ఈ విమానాశ్రయం ప్రారంభం అవుతుందని తెలిపారు. 2,703 ఎకరాల విస్తీర్ణంలో రూ.4,727 కోట్లతో ఈ ప్రాజెక్టు చేపట్టినట్లు వివరించారు. ఈ విమానాశ్రయంలో 3,800 మీటర్ల రన్‌వే ఉందని గుర్తు చేశారు. తొలి దశలో ఏటా 60 లక్షల మంది ప్రయాణికుల సామర్థ్యం ఈ విమానాశ్రయం కలిగి ఉందన్నారు. 500 ఎకరాల్లో ఏవియేషన్ హబ్, 136 ఎకరాల్లో ఏవియేషన్ ఎడ్యుసిటీ ఏర్పాటు చేసినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. ఆగస్టు 1వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమం విజయవంతం చేసేందుకు అధికారులకు సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. అలాగే భద్రత, ట్రాఫిక్, అతిథుల స్వాగత ఏర్పాట్లపై కీలక సూచనలు చేశారు. ప్రతి శాఖ సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. ప్రధాని పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని అన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్‌తో పాటు పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు.



2లో..

## పీహెచ్‌సీల పనితీరుకు 'ఆరోగ్య ఫలితాలే' ప్రామాణికం

సేవల సంఖ్య ఆధారిత ర్యాంకుల విధానానికి స్వస్తి

మాతా శిశు ఆరోగ్యం నుంచి ప్రజల సంతృప్తి వరకు 21 అంశాల ఆధారంగా మార్కులు

మాతృత్వ మరణాలు, సిజేరియన్లు తగ్గిన ఆసుపత్రులకు ర్యాంకింగ్ లో ప్రాధాన్యం

రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్

## కోలుకుంటున్న పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల




అమరావతి: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కోలుకుంటున్నారు. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. శనివారం హైదరాబాద్ కాంటినెంటల్ ఆసుపత్రిలో చేసిన శస్త్ర చికిత్స విజయవంతమైంది. ఇటీవల కొద్దిరోజులు తీవ్ర కడుపునొప్పితో బాధపడిన ఆమె ఉదయం ఆస్పత్రిలో చేరగా వైద్యులు వెంటనే పరీక్షలు జరిపి.. శస్త్ర చికిత్స చేశారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడ ఉందని ధ్రువీకరిస్తూ ఏపీసీసీ అధికారిక ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేసింది. కాగా, ఈ విషయం తెలుసుకున్న సీఎం చంద్రబాబు.. షర్మిల త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. షర్మిల సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజాక్షేత్రంలోకి రావాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు ఎక్స్‌లో పేర్కొన్నారు. మంత్రి లోకేశ్ కూడా షర్మిల త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## అర్హులందరికి సంక్షేమ పథకాలు

అనకాపల్లి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. పాయకరావుపేట మండలం పాల్మన్ పేటలో 'రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి వెళ్లి రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరించారు. కరపత్రాలు పంచారు. రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం సమ ప్రాధాన్యంతో సాగుతున్నాయని వివరించారు. యువతకు ఉపాధి కల్పించేందుకు పరిశ్రమల ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి చిరునామాగా మారుతుందని చెప్పారు. పాయకరావుపేట నియోజకవర్గం పరిశ్రమలకు పర్యాటక రంగానికి కేరాఫ్ అడ్రస్‌గా మారుస్తున్నామని వెల్లడించారు.





2లో..

## విజయ్ ప్రభుత్వానికి మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ

ప్రభుత్వ ఉద్యోగాలు అంగడి సరుకు కాదు

కరూరు బాధితులకు ఉద్యోగాల కల్పపై ఆక్షేపణ



2లో..

## కేంద్రం హామీలు బుట్టదాఖలు

కేసుల ఎత్తివేతపై కదలిక లేని ఉత్తర్వులు

ఇలాగే వ్యవహరిస్తే మళ్లీ ఆందోళనలు

న్యాయసాయం కోసం సాక్షి ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ప్రారంభం

కాక్రోచ్ జనతాపార్టీ నేతల వెల్లడి



2లో..

## సింగరేణిని భ్రష్టు పట్టించిన కెసిఆర్

కాంగ్రెస్ వచ్చినా మారని పరిస్థితి

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శలు

రాజకీయ వేదికలకు సింగరేణిని వాడుకున్నారంటూ బీఆర్ఎస్, కేసీఆర్‌పై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వింత ప్రవర్తన, మొండి వైఖరి వల్లే సింగరేణి సంస్థ తీవ్రంగా నష్టపోయిందని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.




2లో..

## హైడ్రా కమిషనర్‌ను తొలగించండి

పదేపదే కోర్టు ఉల్లంఘనలకు పాల్పడడంపై ఆగ్రహం

ఇలాంటి వ్యక్తి అదే పోస్టులో కొనసాగడం సరికాదు

లోతుకుంట భూముల వ్యవహారంపై హైకోర్టు విచారణ

కోర్టులంటే గౌరవం ఉందంటూ క్షమాపణలు కోరిన రంగనాథ్



2లో..

## ఆకలితో ఏ విద్యార్థి ఉండకూడదు

ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పథకం ప్రారంభిస్తున్నాం

విద్యార్థుల సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం

అల్పాహార పథకాన్ని ప్రారంభించిన డిప్యూటి సిఎం భట్టి

సహజ వనరులు ఎంత ముఖ్యమో, మానవ వనరులు కూడా అంతే ముఖ్యమని పేర్కొన్న డిప్యూటీ సీఎం.. మానవ వనరుల అభివృద్ధిపై పెట్టుబడి పెడితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 22 లక్షల మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం అందించడం చిన్న విషయం కాదని, ఇది దేశంలోనే కాక ప్రపంచ స్థాయిలో కూడా అరుదైన కార్యక్రమమని వ్యాఖ్యానించారు.




2లో..

## ఆ విమాన ప్రమాదం చిన్న ఘటన కాదు




2లో..

## విద్యార్థిని శివాని ఆత్మహత్యపై చంద్రబాబు షాక్

**తీవ్రంగా కలచివేసిందంటూ ఎక్స్‌లో పోస్ట్**

అమరావతి: పోలవరం జిల్లా ఈర్లపల్లికి చెందిన పదో తరగతి విద్యార్థిని ముర్రం శివాని ఆత్మహత్య చేసుకోవడంపై ఏపీ సీఎం చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. మెగా పీటీఎంలో ఎంతో ఉత్సాహంగా మాట్లాడిన విద్యార్థిని మృతి తనను కలచివేస్తోందన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. పదో తరగతి విద్యార్థిని ముర్రం శివాని తనువు చాలించడం నన్ను తీవ్ర విషాదంలోకి నెట్టేసింది. రంపచోడవరంలో నిర్వహించిన మెగా పీటీఎంలో వేదికపై ఎంతో ఉత్సాహంగా మాట్లాడిన విద్యార్థిని బలవన్మరణం ఆవేదన కలిగించింది. ఆరోజు తన చదువు, ఉన్నత లక్ష్యాల గురించి శివాని నాతో చెప్పిన మాటలు గుర్తుకొస్తున్నాయి. ఎంతో భవిష్యత్ ఉన్న గిరిజన బిడ్డ ఇలా తనువు చాలించడం బాధాకరం. కారణాలు ఏవైనా తన కలలు నిజం కాకుండానే ఆ విద్యార్థిని దూరమవడం కలచివేస్తోంది. శివాని మృతిపై పూర్తి దర్యాప్తు జరపాలని అధికారులను ఆదేశించాను. సమస్యలు, కష్టాలు వచ్చినా విద్యార్థులు, యువత ధైర్యంగా నిలబడాలి. ఎవరూ ఒత్తిడి, నిరాశ, నిస్పృహలకు లోను కావొద్దు. ఎంతటి సమస్యకైనా పరిష్కారం ఉంటుంది. మీ బాధ, ఆవేదనను కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఆత్మీయులతో పంచుకోండి. ఒత్తిడిని అధిగమించి మీ కలలను నిజం చేసుకునేలా ముందుకు సాగండి. ప్రభుత్వం అన్ని విధాలుగా మీకు అండగా ఉంటుందని చంద్రబాబు పేర్కొన్నారు. రంపచోడవరం మెగా పీటీఎంలో ఎంతో ఆత్మవిశ్వాసంతో మాట్లాడిన శివాని మృతి తీవ్ర విషాదాన్ని నింపిందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'విషయం తెలిసినప్పటి నుంచి శివాని మాటలు పదేపదే గుర్తొస్తున్నాయి.

సోదరి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా. ఎంత కష్టమైనా పోరాడుదాం.. ఎంతటి సమస్యనైనా ఎదుర్కొందాం.. మీకు నేనున్నాను.. ఈ ప్రభుత్వం ఉందని లోకేశ్ పేర్కొన్నారు.

## వరుస నష్టాలకు బ్రేక్

**లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు**

ముంబై:వరుసగా ఐదు ట్రేడింగ్ సెషన్ల పాటు నష్టాలను చవిచూసిన దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం బలంగా పుంజుకున్నాయి. కొనుగోళ్లు ఊపందుకోవడంతో ప్రధాన సూచీలన్నీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 776.01 పాయింట్లు ఎగబాకింది. నిఫ్టీ 228.5 పాయింట్లు పెరిగి 24 వేల మార్కుకు చేరువైంది. ప్రపంచ మార్కెట్ ర్యాలీ సహా అమెరికా, ఇరాన్‌లు సైనిక దాడులను నిలిపివేస్తామనే నిర్ణయం నేపథ్యంలో ముడి చమురు ధరలు తగ్గడంతో భారత ఈక్విటీలు ఈ వారాన్ని బలంగా ప్రారంభించాయి. ఐటీ, మీడియా, రియాల్టీ, ఆటో, ఫార్మా రంగాల షేర్లలో కొనుగోళ్లు మార్కెట్‌కు ప్రధాన బలంగా నిలిచాయి. ఇక రంగాల వారీగా చూస్తే.. నిఫ్టీ మీడియా సూచీ 2.50 శాతం లాభంతో అగ్రస్థానంలో నిలిచింది. మరోవైపు.. నిఫ్టీ ఆయిల్ అండ్ గ్యాస్ మాత్రం స్వల్ప నష్టం(0.12శాతం)తో ముగిసింది. నిఫ్టీ సూచీలో ఎటర్నల్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, ఇన్ఫోసిస్, బజాజ్ ÷నాన్స్, శ్రీరామ్ ఫైనాన్స్ షేర్లు గరిష్ఠ లాభాలను నమోదు చేయగా.. ఓఎన్‌జీసీ, సిఎ÷-లా, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, అదానీ పోర్ట్స్ షేర్లు ఒత్తిడికి లోనై నష్టాలను చవిచూశాయి. అటు.. విదేశీ మారకద్రవ్య మార్కెట్లో రూపాయి కూడా బలపడింది. అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి 68 పైసలు పెరిగి డాలర్‌కు ?95.89 వద్ద ముగిసింది. గత ట్రేడింగ్ సెషన్‌లో రూపాయి ?96.57 వద్ద ముగిసింది.

## విజయ్ ప్రభుత్వానికి మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ

చెన్నై:తమిళనాడు సిఎం విజయ్ ప్రభుత్వానికి మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ

తగిలింది. కరూర్ తొక్కిసలాటలో మృతి చెందిన వారి కుటుంబాలకు ఇచ్చిన ఉద్యోగాలు చెల్లవని ఉన్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది. రాజ్యాంగ పరిమితులకు లోబడి ప్రభుత్వం వ్యవహరించాలని సూచించింది. ప్రభుత్వ చర్యలపై నియంత్రణ లేకపోతే.. అరాచకం, అశాంతి రాజ్యమేలుతాయని పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగం అనేది ఉచితంగా పంచిపెట్టేది కాదు. దాన్ని కష్టపడి సాధించాలి. ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎంతోమంది ఎదురుచూస్తున్నారని వ్యాఖ్యానించింది. గతేడాది సెప్టెంబర్‌లో జరిగిన టీవీకే ర్యాలీలో చోటుచేసుకున్న తొక్కిసలాటలో 41 మంది మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బాధితుల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని విజయ్ హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మరోసారి కరూర్ వెళ్లి అర్హతలున్న 32 మందికి వివిధ ప్రభుత్వ శాఖల్లో తాత్కాలిక నియామక పత్రాలను అందజేశారు. దీనిపై అన్నాడీఎంకే నేత ఆర్.బి. ఉదయ్‌కుమార్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. చట్టపరమైన విధానాలను పక్కనపెట్టి తాత్కాలిక ప్రాతిపదికన ఉద్యోగాలు ఇచ్చారంటూ హైకోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎంతో మంది యువత తీవ్రంగా శ్రమిస్తున్నారని, ప్రభుత్వం ఏ ఉద్యోగ నియామక ప్రక్రియ చేపట్టినా తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారానే చేపట్టాలని కోరారు. దీనిపై తాజాగా విచారణ చేపట్టి న్యాయస్థానం సీఎం విజయ్ చేపట్టిన ఈ నియామకాలు చెల్లబోవని తీర్పునిచ్చింది.

## ఆ విమాన ప్రమాదం చిన్న ఘటన కాదు

న్యూఢిల్లీ: అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన దుర్ఘటనపై రాజ్యసభలో కేంద్రం కీలక వ్యాఖ్యలు చేసింది. తుది నివేదికల విడుదలపై తలెత్తుతున్న ప్రశ్నలపై బదులిస్తూ.. ఈ కేసు దర్యాప్తులో ఎటువంటి ఆలస్యం జరగలేదని స్పష్టంచేసింది. అదేమీ చిన్న సంఘటన కాదని.. అటువంటి భారీ ప్రమాదాల దర్యాప్తును పూర్తి చేయడానికి సమయం పడుతుందని తెలిపింది. భారీ విమాన ప్రమాదాల దర్యాప్తు అనేక అంశాలు.. వేర్వేరు పరిస్థితులపై ఆధారపడి ఉంటుందని.. అందువల్ల తుది నివేదిక కోసం ఎంత సమయం పడుతుందనే విషయాన్ని ముందుగానే అంచనా వేయడం సాధ్యం కాదని వెల్లడించింది.

ప్రమాదానికి గల కారణాలను సమగ్రంగా నిర్ధరించడానికి ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో కృషి చేస్తోందని పౌర విమానయానశాఖ పేర్కొంది. నిర్దేశిత విధానాల ప్రకార దర్యాప్తు కొనసాగుతోందని తెలిపింది. ప్రమాదానికి దారితీసిన అన్ని కారణాలు, ఇతర అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్టు వెల్లడించింది. అయితే ఈ ఘటనపై ఇప్పటివరకు ఎటువంటి తుది నిర్ణయానికి రాలేదని వెల్లడించింది. ప్రస్తుతం విమాన 'థ్రస్ట్ కంట్రోల్ మాడ్యూల్' ను తనిఖీ చేసే ప్రక్రియ జరుగుతోందని తెలిపింది. గతేడాది అహ్మదాబాద్‌లో టేకాఫ్ అయిన వెంటనే ఎయిరిండియా విమానం కుప్పకూలిన ఘటనలో 241 మంది ప్రాణాలు కోల్పోవడం అందరినీ విషాదానికి గురిచేసిన విషయం తెలిసిందే

# కేంద్రం హామీలు బుట్టదాఖలు



న్యూఢిల్లీ: నిరసనకారులపై పోలీసు చర్యలు కొనసాగుతున్నాయని, కేసుల ఉపసంహరణనపై కేంద్రం తమకు ఇచ్చిన మాటను ఉల్లంఘిస్తోందని 'కాక్రోచ్ జనతా పార్టీ' ఆరోపించింది. మళ్లీ దేశవ్యాప్త నిరసనలు ప్రారంభిస్తామని హెచ్చరించింది. కేంద్ర విద్యశాఖ మంత్రిగా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత సీజేపీ తన నిరసనను విరమించింది. కేంద్రంతో చర్చల సమయంలో విద్యార్థులపై కేసులు ఎత్తివేతపై కేంద్రం అంగీకరించిందని సీజేపీ చెబుతోంది. కేసులు విత్ డ్రా చేయకుపోతే నేటి నుంచి మళ్లీ ఉద్యమిస్తామని హెచ్చరించారు. నిరసనకారులపై నమోదైన అన్ని ఎఫ్ఐఆర్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని, అదుపులోకి తీసుకున్న విద్యార్థులను విడుదల చేయాలని మరియు వాలంటీర్లపై నిఘా, వేధింపులను ఆపాలని సీజేపీ డిమాండ్ చేసింది. నిరసనకారులపై ఎలాంటి చర్యలు తీసుకోబోమని ప్రభుత్వం ఇచ్చిన హామీని ఉల్లంఘిస్తోందని సీజేపీ ప్రతినిధి అశుతోష్ రాంకా ఎక్స్‌లో ఆరోపించారు. బీహార్, బెంగాల్‌లలో వందలాది విద్యార్థులను అరెస్ట్ చేస్తున్నారని, ఢిల్లీ, ఇతర రాష్ట్రాల్లో వందలాది మందిపై నిఘా ఉంచి వేధిస్తున్నారని, నిరసనకారులకు లాజిస్టిక్స్ సపోర్ట్ అందించిన వాలంటర్లను వేధిస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు కాక్రోచ్ జనతా పార్టీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ కీలక వ్యాఖ్యలు చేశారు. కేసుల్లో చిక్కుకున్న విద్యార్థుల న్యాయసహాయం కోసం 'సాక్షి' అనే ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ప్రారంభించినట్లు సీజేపీ ప్రకటించింది. తమకు ఇచ్చిన హామీని కేంద్రం నిలబెట్టుకోవట్లేదని ఆరోపించారు. పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసన చేపట్టిన ఆందోళనకారులపై నమోదైన కేసులు ఉపసంహరించు కుంటామని కేంద్ర మంత్రులు తమకు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అందువల్లే తాము నిరసనలు

నిలిపివేశామన్నారు. కానీ, ఇంతవరకూ విద్యార్థులు, ఇతర నిరసనకారులపై పెట్టిన కేసులను ఎత్తివేయలేదని తెలిపారు. అస్సాం, పశ్చిమ బెంగాల్, బిహార్ వంటి రాష్ట్రాల్లో పలువురు ఆందోళనకారులను అరెస్టు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. ఈ కేసుల గురించి న్యాయవాదులను సంప్రదిస్తున్నామని సౌరవ్ పేర్కొన్నారు. తమకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కేంద్రానికి మరోసారి గుర్తు చేస్తున్నట్లు తెలిపారు. రేపటిలోగా దేశవ్యాప్తంగా ఆందోళన కారులపై నమోదైన అన్ని కేసులు ఉపసంహరించు కోవాలని.. నిర్బంధంలో ఉన్న నిరసనకారులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే తమ తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని అన్నారు. ఈ విషయంలో కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు. నిరసనకారులపై నమోదైన అన్ని ఎఫ్ఐఆర్‌లను తక్షణమే ఉపసంహరించుకోవాలని, మరియు బీజేపీ పాలిత లేదా బీజేపీ ఢిల్లీ పోలీసులు, కేంద్ర దర్యాప్తు సంస్థలు లేదా పోలీసు బలగాలు కొత్త కేసులు నమోదు చేయకూడదని సీజేపీ డిమాండ్ చేశారు.

అలా చేయని పక్షంలో మళ్లీ నిరసనలో కూర్చుంటామని కేంద్రానికి అల్టిమేటం జారీ చేసింది. కేసులు ఎత్తేస్తామనే హామీని లిఖితపూర్వకంగా తమకు బుధవారం లోగా ఇవ్వాలని సీజేపీ కోరింది. సోమవారం నాడు సీనియర్ సుప్రీం కోర్టు న్యాయవాది మరియు ఎస్పీ రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్‌తో కలిసి నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో, సీజేపీ ప్రతినిధి సౌరవ్ దాస్ మాట్లాడుతూ, ప్రభుత్వం తమ డిమాండ్లను అంగీకరించిన తర్వాత జూలై 25న ఆందోళనను విరమించుకున్నామని, అయితే ఆందోళన తగ్గుముఖం పట్టిన కొద్దీ విద్యార్థులను ఒక్కొక్కరిగా లక్ష్యంగా చేసుకుంటారని తాము ముందే ఊహించామని తెలిపారు.

# హైడ్రా కమిషనర్‌ను తొలగించండి



హైదరాబాద్: హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆయన్ను హైడ్రా కమిషనర్ పోస్టు నుంచి తప్పించాలని సీఎస్‌ను ఆదేశించింది. రంగనాథ్‌పై 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉన్నాయని ఉన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టులను ఆశ్రయించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని పేర్కొంది. ఉన్నతాధికారిగా ఉన్న రంగనాథ్.. కోర్టు ఉత్తర్వులను ఇన్నిసార్లు ధిక్కరించడం సరికాదని ఆక్షేపించింది. మల్కాజిగిరి పరిధిలోని లోతుకుంట భూములకు సంబంధించి గతంలో ఉన్నత న్యాయస్థానం ఆదేశాలను హైడ్రా ఉల్లంఘించిందంటూ శాంతా శ్రీరాం కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు ఆదేశాలు ఉన్నా.. ఫెన్సింగ్‌ను హైడ్రా సిబ్బంది తొలగించారని పేర్కొంది. ఒకే పిటిషన్‌కు సంబంధించి పలుమార్లు కోర్టు ఉత్తర్వులను హైడ్రా కమిషనర్ ధిక్కరించడం నేరమని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో కోర్టుకు ఆయన హాజరుకావాలని ఆదేశించింది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ జోక్యం చేసుకుని దీనిపై పూర్తిస్థాయిలో అఫిడవిట్ దాఖలు చేస్తామని తెలిపారు. అఫిడవిట్‌లో రంగనాథ్ క్షమాపణ కోరారు. కోర్టుల పట్ల పూర్తిస్థాయి నమ్మకముందని పేర్కొన్నారు. లోతుకుంట సర్వే నంబర్ 1, 2లో ఉన్న 40 ఎకరాల భూమిలోకి వెళ్లలేదని తెలిపారు. దీనిపై స్పందించిన హైకోర్టు.. రంగనాథ్‌పై 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉన్నాయని, దీనికి కారణమేంటని ప్రభుత్వం తరపు న్యాయవాదిని ప్రశ్నించింది. ఈ క్రమంలో రంగనాథ్‌ను తొలగించాలని పేర్కొంటూ.. ఆయన స్థానంలో మరొకరిని నియమించాలని ఆదేశించింది. లోతుకుంట భూముల వ్యవహారానికి సంబంధించి తెలంగాణ హైకోర్టులో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ కేసు విచారణ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్ పదవి నుంచి రంగనాథ్‌ను తొలగించాలంటూ.. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది. సెక్రటరీ ర్యాంక్ స్థానంలో ఉన్న ఉన్నతాధికారి.. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడం ఏ మాత్రం సమంజసం కాదని ధర్మాసనం పేర్కొంది. అర్హత కలిగిన అధికారిని హైడ్రా కమిషనర్‌గా నియమించాలని హైకోర్టు సూచించింది. 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లపై ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయస్థానం.. లోతుకుంట ప్రైవేటు భూములపై హైడ్రా జోక్యాన్ని తప్పుబట్టింది. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్ కొనసాగితే రూల్ ఆఫ్ లా తప్పుతుందని పేర్కొంది. ఇన్ని ఉల్లంఘనలకు పాల్పడుతున్న అధికారిని ఇంకా అదే పోస్టులో కొనసాగించడం సరికాదని.. రంగనాథ్‌ను తొలగించడం తప్ప మరో ఆప్షన్

లేదని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసు విచారణ సందర్భంగా హైకోర్టుకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షమాపణలు తెలిపారు. కోర్టులు, న్యాయ వ్యవస్థపై తనకు ఎంతో నమ్మకం ఉందని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అలాగే లోతుకుంట సర్వే నంబర్లు 1, 2 పరిధిలోని 40 ఎకరాల భూమిలోకి హైడ్రా బృందం వెళ్లలేదని కోర్టుకు

వివరించారు. ఈ విషయంలో పిటిషనర్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని కూడా రంగనాథ్ తన అఫిడవిట్‌లో తెలిపారు.

# సింగరేణిని భ్రష్టు పట్టించిన కెసిఆర్

**కాంగ్రెస్ వచ్చినా మారని పరిస్థితి**

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శలు**



న్యూఢిల్లీ: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సింగరేణికి తీవ్ర నష్ట చేకూర్చిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా సింగరేణి మెరుగుపడటం లేదని వ్యాఖ్యానించారు. కేంద్రం 49 శాతం, తెలంగాణ ప్రభుత్వం 51 శాతం వాటాతో సింగరేణి కొనసాగుతోందని కేంద్ర మంత్రి తెలిపారు. దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద బొగ్గు కంపెనీ సింగరేణి అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. సింగరేణి నుంచి కర్ణాటక, ఏపీ, మహారాష్ట్ర, ఎన్‌టీపీసీ కి బొగ్గు సరఫరా అవుతుందని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్.. సింగరేణికి తీరని ద్రోహం చేశారని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి ఆదాయానికి గత ప్రభుత్వం గండికొట్టిందని ఆరోపించారు. రాజకీయ వేదికలకు సింగరేణిని వాడుకున్నారంటూ బీఆర్‌ఎస్, కేసీఆర్‌పై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వింత ప్రవర్తన, మొండి వైఖరి వల్లే సింగరేణి సంస్థ తీవ్రంగా నష్టపోయిందని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2014లో సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా బొగ్గు గనులను పారదర్శకంగా వేలం పాట ద్వారా కేటాయించాలని ఆదేశించినప్పటికీ, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వేలం పాటల్లో పాల్గొనకుండా నిర్లక్ష్యం వహించిందన్నారు. నూతన బొగ్గు బ్లాకులు లభించక, ఆదాయ మార్గాలు మూసుకుపోయి సింగరేణి వెనుకబడిపోవడానికి కేసీఆర్ ద్రోహమే కారణమని ఆయన ఆరోపించారు. సంస్థను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారని, గతంలో కేంద్రం ఇచ్చే రూ. 525 కోట్ల నిధులను సక్రమంగా వినియోగించుకోలేకపోయారని విమర్శించారు. 2015లోనే ఒడిశాలోని నైని కోల్ బ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం సింగరేణికి కేటాయించినప్పటికీ, నాటి కేసీఆర్ ప్రభుత్వం ఒడిశా ముఖ్యమంత్రితో కనీసం మాట్లాడలేదని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. అయితే, ఇటీవల ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాము చొరవ తీసుకుని నైని కోల్ బ్లాక్‌కు సంబంధించి అవసరమైన అన్ని అనుమతులను ఇప్పించినట్లు వెల్లడించారు. అలాగే తాడిచర్ల-2 బ్లాక్‌ను కూడా కేంద్రం సింగరేణికి కేటాయించిందని, మణుగూరులోని ఒక బ్లాక్‌ను వేలంలో ఉంచామని తెలిపారు. అయితే ఈ వేలంలో సింగరేణికి పోటీగా తెలంగాణ జెన్కో పాల్గొనడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. జెన్కో టెండర్ నుంచి తప్పుకుని, ఆ బ్లాకులు సింగరేణికి దక్కేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై సీఎంకు లేఖ రాయనున్నట్లు వెల్లడించారు. ఈ మూడు కొత్త బ్లాకులు సింగరేణికి దక్కితే సుమారు 6,500 మందికి ఉద్యోగావకాశాలు రావడంతో పాటు, 830 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగి, దాదాపు రూ. 1.95 లక్షల కోట్ల టర్నోవర్‌తో సంస్థకు, రాష్ట్ర ప్రభుత్వానికి భారీగా ఆదాయం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పబ్లిక్ పరీక్షల చట్టం గురించి మాట్లాడుతూ.. 2024లోనే ఎలాంటి డిమాండ్లు, నిరసనలు లేకపోయినా ముందస్తు జాగ్రత్తగా ఈ యాంటీ-పేపర్ లీక్ బిల్లును తీసుకొచ్చామని తెలిపారు. భవిష్యత్తులో ఎవరైనా పేపర్ లీకేజీలకు పాల్పడాలంటే భయపడేలా, గుండెలాగిపోయే స్థాయిలో అత్యంత కఠినమైన నిబంధనలతో ఈ చట్టాన్ని రూపొందించామని చెప్పారు. విద్యా వ్యవస్థలో మార్పుల కోసం ప్రతిపక్ష కాంగ్రెస్ కూడా స్వాగతిస్తుందని భావిస్తే, వారు చట్టాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయడం విచారకరమన్నారు. ఫలితాలు వచ్చిన వేళ నిరాశతో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వారిలో ధైర్యాన్ని నింపాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చివరగా, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన దాడి ఘటన తీవ్ర బాధాకరమని, దీనిపై ప్రస్తుతం సుప్రీంకోర్టు విచారణ జరుపుతోందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

## పీహెచ్‌సీల పనితీరుకు ఆరోగ్య ఫలితాలే ప్రామాణికం

అమరావతి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరు మదింపులో కూటమి ప్రభుత్వం సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది. ఎంతమంది రోగులకు సేవలందించారు? ఎన్ని పరీక్షలు చేశారు? ఎన్ని ప్రసవాలు నిర్వహించారు? అనే లెక్కలను మాత్రమే కాకుండా... అందించిన వైద్య సేవల వల్ల ప్రజల ఆరోగ్యంలో ఎంత మార్పు వచ్చింది? మాతా శిశు మరణాలు తగ్గాయా? రక్తపోటు, మధుమేహ రోగులకు నిరంతర చికిత్స అందుతోందా? లేదా? సేవలపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారా? అనే ఫలితాల ఆధారంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరును గుర్తించనున్నారు.ఇందుకోసం మొత్తం 21 కీలక పనితీరు సూచికలతో కొత్త ర్యాంకింగ్, గ్రేడింగ్ విధానాన్ని ప్రభుత్వం రూపొందించింది. 'సంజీవని', 'మాతృత్వ', 'క్షేమ' కార్యక్రమాలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరును అనుసంధానిస్తూ... గ్రామస్థాయి వైద్య వ్యవస్థను మరింత జవాబుదారీగా, ఫలితాల ఆధారితంగా, ప్రజలకు చేరువగా తీర్చిదిద్దడమే ఈ కొత్త ర్యాంకింగ్ విధానం ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ప్రస్తుతం 5 అంశాల ఆధారంగానే వైద్యారోగ్య శాఖ ర్యాంకులను ప్రకటిస్తోంది. ఓపీ విధానంలో రోగుల సంఖ్య, ఆసుపత్రిలో చేరినవారు, ల్యాబ్ పరీక్షలు, ప్రసవాలు, గర్భనిరోధక సాధనాల వాడకం వంటి ఐదు అంశాల ఆధారంగానే పీహెచ్‌సీల పనితీరును అంచనా వేసేవారు. ఈ విధానంలో సేవల సంఖ్య మాత్రమే తెలుస్తోందని... వ్యాధుల నివారణలో సాధించిన పురోగతి, మాతా శిశు ఆరోగ్య ఫలితాలు, దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణ, రోగులకు నిరంతర చికిత్స వంటి కీలక అంశాలు ప్రతిబింబించడం లేదని అధికారుల పునస్సమీక్షలో తేలింది. ఈ విధానం అమలు, ఫలితాలపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ జారీ చేసిన ఆదేశాల మేరకు అధికారులు పునస్సమీక్ష జరిపారు. సేవలు మెరుగుపడాలంటే 21 కొలమానాల ఆధారంగా ర్యాంకులను ప్రకటించాల్సిన అవసరం ఉందని మంత్రికి నివేదించారు. వీటికి మంత్రి ఆమోదం తెలుపుతూ... గ్రామీణులకు వైద్య సేవలు అందించడంలో కీలకంగా ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరు ఈ కొత్త ర్యాంకింగ్ విధానంతో మరింత మెరుగుపడుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కేవలం సేవల సంఖ్యనే కాకుండా, వాటివల్ల ప్రజలకు కలిగిన ఆరోగ్య ప్రయోజనాలకు గుర్తింపునిస్తూ కొత్త ర్యాంకింగ్ విధానాన్ని రూపొందించారు.సదరు పీహెచ్సీ ల పరిధిలో నమోదయ్యే టీనేజ్ గర్భధారణలు, హైరిస్క్ గర్భిణుల నమోదు, గర్భధారణ కాలంలో అందించే వైద్య సేవలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు, సిజేరియన్ ప్రసవాల శాతం, మొత్తం సంతానోత్పత్తి రేటు, మాతృ మరణాల నియంత్రణను పరిగణనలోకి తీసుకోనున్నారు. కొత్త ర్యాంకింగ్‌లో ఇవి అత్యంత కీలకం కానున్నాయి. శిశు మరణాలు, తక్కువ బరువుతో జన్మించిన పిల్లలు, ఏడాదిలోపు శిశువులకు పూర్తిస్థాయిలో టీకాలు, పిల్లల్లో పుట్టుకతో వచ్చే లోపాలు, పోషకాహార లోపాలు, వ్యాధులు, ఎదుగుదలలో ఆలస్యాన్ని గుర్తించే పరీక్షలను కొత్త విధానంలో చేర్చారు. ఆరోగ్య సమస్యలున్న పిల్లలను గుర్తించి ఉన్నత వైద్య కేంద్రాలకు పంపించడంతోనే అధికారుల బాధ్యత ముగియదు. వైద్యాధికారి సూచించిన పిల్లలకు వాస్తవంగా చికిత్స అందిందా? లేదా? అన్న అంశాన్నీ పరిశీలిస్తారు. దీనివల్ల పరీక్షల దశ నుంచి చికిత్స పూర్తయ్యే వరకు ప్రతి దశలోనూ పిల్లల ఆరోగ్యాన్ని పర్యవేక్షించేందుకు వీలవుతుంది.మధుమేహం, అసంక్రమిత వ్యాధుల నియంత్రణకు కొత్త విధానంలో ప్రాధాన్యం ఇచ్చారు. అర్హులైన ప్రజల్లో రక్తపోటు మధుమేహం (ఆతిజీఎవబివబ), సాధారణ క్యాన్సర్ల పరీక్షలు ఎంతవరకు పూర్తయ్యాయి? వ్యాధి నిర్ధారణ అయిన వారికి క్రమం తప్పకుండా మందులు అందుతున్నాయా? వైద్య పరీక్షలు జరుగుతున్నాయా? అనే అంశాలను మదింపు చేస్తారు. క్యాన్సర్ అనుమానితులను గుర్తించి సకాలంలో ఉన్నత వైద్య కేంద్రాలకు పంపించడాన్ని కూడా పనితీరు సూచికగా చేర్చారు. దీంతో వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించే అవకాశాలు పెరగనున్నాయి.పీహెచ్‌సీల్లో వైద్య సేవలు పొందిన ప్రజలు ఐవీఆర్ఎస్ (ఖీఉా) ద్వారా తెలియజేసే అభిప్రాయాన్ని కూడా ర్యాంకింగ్‌లో భాగం చేశారు. వైద్యులు, సిబ్బంది ప్రవర్తన, ఆసుపత్రి పరిశుభ్రత, వేచి ఉండే సమయం, మందుల లభ్యత, రోగులకు ఇచ్చే గౌరవం వంటి అంశాలు ర్యాంకింగ్‌ను నిర్ణయించడంలో కీలకం కానున్నాయి. మొత్తం 21 కీలక పనితీరు సూచికల్లో ఒక్కో అంశానికి గరిష్ఠంగా ఒక పాయింట్ కేటాయిస్తారు. సాధించిన మొత్తం స్కోరును శాతంగా మారుస్తారు. లక్ష్యాన్ని ఎక్కువగా సాధించాల్సిన అంశాల్లో మెరుగైన ఫలితాలకు అధిక స్కోరు ఇస్తారు.

## ఆందోళనల నడుమే లోక్‌సభ వాయిదా

**పేపర్ లీకుల బిల్లుపై నేడు చర్చ**

న్యూఢిల్లీ: విపక్షాల ఆందోళనల నడుమ లోక్‌సభ మంగళవారానికి వాయిదా పడింది. పేపర్ లీకులకు పాల్పడే వారికి కఠిన శిక్షలు విధించేలా 2024 నాటి ప్రవేశ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్ట సవరణ బిల్లు ఇవాళ లోక్‌సభ ముందుకు వచ్చినా.. బిల్లుపై చర్చించడం సాధ్యం కాలేదు. ఓ వైపు విపక్షాల ఆందోళనలు కొనసాగుతుండగానే.. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ సోమవారం ఉదయం ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అనంతరం లోక్‌సభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది.

తిరిగి సభ ప్రారంభమైన వెంటనే.. ప్రతిపక్ష సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సభను అడ్డుకున్నారు. దీంతో మరోసారి స్పీకర్ ఓం బిర్లా సభను మధ్యాహ్నం 5 గంటలకు వాయిదా వేశారు. ఆ తర్వాత కూడా చర్చ చేపట్టకుండా విపక్షాలు అడ్డుకున్నాయి. ఈ క్రమంలో సభను నేటికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. పేపర్ లీక్ బిల్లు (సవరణ) చర్చకు రాకుండా విపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు విమర్శించారు. ఈ బిల్లుపై సభలో మంగళవారం చర్చించి.. అనంతరం ఓటింగ్ నిర్వహించనున్నారు.

## తక్కువ ధరలకే నాణ్యమైన బియ్యం

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గుడ్ న్యూస్ చెప్పారు. ఈ ఏడాది ఆగస్టు 1 నుంచి తక్కువ ధరకే నాణ్యమైన బియ్యాన్ని అందించనున్నట్లు తెలిపారు. ఏపీ పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో తక్కువ ధరకే బియ్యం అమ్మకాలు జరగనున్నట్లు పవన్ పేర్కొన్నారు. బీపీటీ సూపర్ ÷న్ బియ్యం కేజీ రూ.52, పచ్చి బియ్యం కేజీ రూ.50కి అందజేయడంతో సామాన్యులకు ఊరట లభించనుందని తెలిపారు. ఏపీ ప్రజలకు అండగా ఉండేందుకే కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు డిప్యూటీ సీఎంవో కార్యాలయం ఎక్స్ వేదికగా పోస్టు పెట్టింది. 'కూటమి ప్రభుత్వం సామాన్యుడికి అండగా నిలుస్తుందని చాటి చెప్పేలా ఏపీ పౌర సరఫరాల శాఖ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నా. బహిరంగ మార్కెట్‌లో పెరుగుతున్న బియ్యం ధరల నుంచి సామాన్యులకు సాంత్వన చేకూర్చేలా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో తక్కువ ధరకే బియ్యం అమ్మకాలు చేపట్టడం హర్షణీయం. ఆగస్టు 1 నుంచి ఏపీలోని 130 రైతుబజార్లు, 500 రైస్ మిల్లర్ల ప్రత్యేక కౌంటర్లలో బియ్యం అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేశారు. బీపీటీ సూపర్ ÷న్ బియ్యం కేజీ రూ.52కు, గ్రేడ్-1 పచ్చి బియ్యం కేజీ రూ.50కి అందించనున్నారు మంత్రి నాదెండ్ల మనోహర్. సామాన్యులపై ధరల భారం పడకుండా కూటమి ప్రభుత్వం తరఫున ఆయన ప్రత్యేకంగా చొరవ తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నా. బహిరంగ మార్కెట్ ధరలను సమీక్షించి, మిల్లర్లతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉండేలా ధరలను నిర్ణయించాం.

భారత్ ప్రతినిధి
తెలుగు దిన పత్రిక




## జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన సౌత్ డీఎస్పీ

**గుంటూరు, 27 జూలై 2026, భారత్ ప్రతినిధి :** గుంటూరు జిల్లా నూతన సౌత్ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన జి .పూర్ణచంద్రరావు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఎస్పీ పూర్ణచంద్రరావు ఎస్పీకి పూల మొక్కను అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలకు మరింత మెరుగైన పోలీసు సేవలు అందిస్తూ, చట్టం, శాంతిభద్రతల పరిరక్షణలో సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఏలూరు డీటీసీ నుంచి బదిలీపై గుంటూరు సౌత్ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన జి .పూర్ణచంద్రరావు, అనంతరం ఎస్పీ ఆశీస్సులు పొందారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో గుంటూరు జిల్లా ముందంజలో ఉండాలి

### జిల్లా కలెక్టర్ సి. యం. సాయికాంత్ వర్మ




**గుంటూరు, 27 జూలై 2026, భారత్ ప్రతినిధి :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజలు అందిస్తున్న అర్జీల పరిష్కారంలో గుంటూరు జిల్లా ముందంజలో ఉండాలని జిల్లా కలెక్టర్ సి. యం. సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని శంకరన్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన అర్జీదారుల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేశారు. అర్జీల పరిష్కార తీరుపై జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకోవాలనే ఆశతో అధికారులను ఆశ్రయిస్తున్నారని, వారి అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించాలని సూచించారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించడంతో పాటు, పరిష్కారం సాధ్యంకాని అంశాలపై స్పష్టమైన కారణాలను అర్జీదారులకు తెలియజేయాలని ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో జిల్లాల వారీగా జరుగుతున్న పని తీరును అధికారులు నిరంతరం పరిశీలించుకోవాలని, గుంటూరు జిల్లా పనితీరు మెరుగ్గా ఉండేలా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. పెండింగ్లో ఉన్న అర్జీలను శాఖల వారీగా సమీక్షించి, వాటి పరిష్కారానికి చర్యలు వేగవంతం చేయాలని అన్నారు. ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకం పెరిగేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ యంత్రాంగం ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. అర్జీదారుల సౌకర్యం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంచినీటి వసతి, మండే ఎండల నుండి ఉపశమనంగా మజ్జిగ అందజేయడం, భోజన సౌకర్యం, వైద్య శిబిరం, తదితర ఏర్పాట్లు పట్ల అర్జీదారులు సంతోషం వ్యక్తం చేశారు. జిల్లాలో పి.జి.ఆర్.ఎస్ కు మొత్తం 624 అర్జీలు అందాయి. అందులో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పి.జి.ఆర్.ఎస్ కు 336, పోలీస్ సూపరింటెండెంట్ కార్యాలయంలో జరిగిన పి.జి.ఆర్.ఎస్ కు 194 అర్జీలు, గుంటూరు రెవిన్యూ డివిజన్ పరిధిలో 10 అర్జీలు, తెనాలి రెవిన్యూ డివిజన్ పరిధిలో 24 అర్జీలు, గుంటూరు నగర పాలక సంస్థకు 52, మిగిలిన మున్సిపాలిటీల పరిధిలో 8 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో జెడ్పి సిఈఓ జ్యోతి బసు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి విజయ లక్ష్మి, డి పి ఓ సాయి కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి, ఉద్యానవన శాఖ అధికారి రవీంద్ర బాబు, పశు సంవర్ధక శాఖ అధికారి సత్యనారాయణ, ఆర్ టి ఓ శ్రీహరి రావు, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఆగస్టు 15 నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం : జీఎంసీ కమిషనర్




**గుంటూరు, 27 జూలై 2026, భారత్ ప్రతినిధి :** గుంటూరులో ఆగస్టు 15 నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేయనున్నట్లు జీఎంసీ కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు. నిషేధిత ప్లాస్టిక్ తయారీ, విక్రయం, వినియోగంపై ప్రత్యేక బృందాలతో తనిఖీలు నిర్వహించి, ఉల్లంఘనదారులపై జరిమానాలు, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు, వ్యాపారులు సహకరించాలని కోరారు.

# పిజిఆర్ఎస్ ద్వారా ప్రజల సమస్యలకు వేగవంతంగా పరిష్కారం

### జిల్లా ఎస్పీ వకుల్ జిందల్



**గుంటూరు, 27 జూలై 2026, భారత్ ప్రతినిధి :** గుంటూరు జిల్లా ప్రజలకు పారదర్శకమైన, ప్రజలకు చేరువైన పోలీసింగ్ అందించాలనే లక్ష్యంతో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్ (పిజిఆర్ఎస్) ద్వారా ప్రజల సమస్యలకు వేగవంతంగా పరిష్కారం అందిస్తున్నామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ఎస్పీ స్వయంగా 194 ఫిర్యాదులను స్వీకరించి, ఒక్కో ఫిర్యాదును పరిశీలించారు. ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా విచారించి, బాధితులకు చట్టపరంగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన ప్రజలకు ఫిర్యాదుల నమోదు, దరఖాస్తుల స్వీకరణ తదితర ప్రక్రియల్లో పోలీస్ సిబ్బంది అవసరమైన సహకారం అందించారు. అదేవిధంగా, అమ్మ చారిటబుల్ ట్రస్ట్, సాయి నగర్, గుంటూరు ఆధ్వర్యంలో ప్రతి వారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని ఎస్పీ అభినందించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు, వృద్ధులు, నిరుపేదలకు ఈ సేవ ఎంతో ఉపయోగకరంగా ఉందని పేర్కొంటూ ట్రస్ట్ ప్రతినిధులను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) జి.వి. రమణమూర్తి, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ట్రాఫిక్ డీఎస్పీ, బెల్లం శ్రీనివాసరావు, ఈస్ట్ డీస్పీ, టీ. సీతారాం, పిజిఆర్ఎస్ సీఐ బిలాలుద్దీన్, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సంగీతం అన్ని శాస్త్రాల్లో అత్యున్నతమైనది: శోభారాజు





**గుంటూరు, 27 జూలై 2026, భారత్ ప్రతినిధి :** ఆచార్య నాగార్జున యూనివర్సిటీ స్వర్ణోత్సవాల్లో భాగంగా సోమవారం ప్రముఖ సంగీత విద్వాంసురాలు, సుమన్ అవార్డు గ్రహీత శోభారాజు అన్నమాచార్యకీర్తనల పరమార్థాన్ని విద్యార్థులకు సోదాహరణంగా వివరించారు. సంగీతం అన్ని శాస్త్రాల్లో అత్యున్నతమైందని, అన్నమయ్య గొప్ప సంగీతకారుడే కాక సంఘ సంస్కర్త అని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమానికి ప్రిన్సిపల్ సురేష్కుమార్ అధ్యక్షత వహించగా, యూనివర్సిటీ అధికారులు శోభారాజును ఘనంగా సత్కరించారు.

# అభివృద్ధి పనులకు వేగం పెంచుతున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు, 27 జూలై 2026, భారత్ ప్రతినిధి :** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 21వ డివిజన్లో అభివృద్ధి పనులకు వేగం పెంచుతూ ఎమ్మెల్యే గళ్ళా మాధవి సోమవారం పలు సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు, వెట్మిక్స్ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోదండ రామయ్య నగర్ 4వ లైన్, కేవీపీ కాలనీ 3వ లైన్, శశాంక్ గోయల్ కాలనీలోని జెమిని స్కూల్ సమీపం, గడ్డిమల్లు జీరో లైన్ ప్రాంతాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 21వ డివిజన్లో దాదాపు రూ.3.5 కోట్ల విలువైన సీసీ రోడ్లు, డ్రైన్లు, కల్వర్టులు, వెట్మిక్స్ రోడ్ల పనులను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. కోదండరామయ్య నగర్, కొండా వెంకటప్పయ్య కాలనీ, శశాంక్ గోయల్ కాలనీ, భానుప్రసాద్ కాలనీ, గడ్డిమల్లు తదితరప్రాంతాల్లో ఎన్నోఏళ్లుగా ప్రజలు రోడ్లు, డ్రైనేజీ సదుపాయాల లేమితో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టర్లు, నిర్మాణ సంస్థలు బ్లాక్లిస్ట్లోకి వెళ్లిపోవడంతో టెండర్లు పూర్తయినా పనులు ముందుకు సాగని పరిస్థితి నెలకొందన్నారు. ఒకే ప్రాంతంలో ఒక రోడ్డు పూర్తవగా పక్కనే మరో రోడ్డు పనులు నిలిచిపోయే పరిస్థితిని ప్రజలు ఎదుర్కొన్నారని చెప్పారు. ఆ సమస్యలను పరిష్కరించేందుకు రీ-టెండర్లు నిర్వహించి కొత్త కాంట్రాక్టర్ల ద్వారా పనులను పునఃప్రారంభించామని గళ్ళా మాధవి తెలిపారు. ఇప్పటికే 21వ డివిజన్లో రూ.7 కోట్లకు పైగా అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, ప్రస్తుతం మరో రూ.3.5 కోట్ల పనులను ప్రారంభిస్తున్నామని తెలిపారు. మొత్తం మీద ఈ డివిజన్లో సుమారు రూ.10 కోట్ల అభివృద్ధి పనులు చేపడుతున్నామని, మిగిలిన పనులను కూడా ఈ ఆర్థిక సంవత్సరంలోనే పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ప్రజలకు రోడ్లు, కాలువలు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, గత రెండు సంవత్సరాలుగా ఎవరూ పట్టించుకోని ప్రాంతాల్లో సైతం పర్యటిస్తూ ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కరిస్తున్నామని చెప్పారు. 21వ డివి జన్లో ఖాళీ స్థలాలు అధికంగా ఉండటంతో వాటి వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, ప్రజల ఫిర్యాదుల మేరకు ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. జీఎంసీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోనే ప్రత్యేకంగా ఖాళీ స్థలాల క్లియరెన్స్ డ్రైవ్ చేపడుతున్నారని, ప్రస్తుతం ఆదర్శనగర్, మిర్చియార్డు ప్రాంతాల్లో జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని త్వరలో 21వ డివిజన్లో కూడా అమలు చేసి అన్ని ఖాళీ స్థలాలను శుభ్రం చేయనున్నట్లు తెలిపారు. వీఐపీ రోడ్డును ఇటీవల అభివృద్ధి చేసి రోడ్డు నిర్మాణంతో పాటు కల్వర్టు, ప్లాంటేషన్ పనులు పూర్తి చేశామని చెప్పారు. స్థానిక ప్రజల అభ్యర్థన మేరకు స్పీడ్ బ్రేకర్లు కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. భారీ లోడ్లతో వచ్చే వాహనాలు గట్టర్లను దెబ్బతీస్తున్న సమస్యపై కూడా తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గతంలో ఖాళీ స్థలాల కారణంగా గంజాయి వంటి సామాజిక సమస్యలు ఎక్కువగా ఉండేవని, ప్రత్యేక డ్రైవ్లు, రెగ్యులర్ బీట్ కానిస్టేబుళ్లు, పెట్రోలింగ్ చర్యల వల్ల పరిస్థితి గణనీయంగా మెరుగుపడిందన్నారు. మిగిలిన ప్రాంతాల్లో కూడా కఠిన చర్యలు కొనసాగుతాయని తెలిపారు. ఇటీవల మహిళా గ్రీవెన్స్ కార్యక్రమానికి గడ్డిమల్లు ప్రాంత మహిళలు వచ్చి తమ ప్రాంతంలో దయనీయంగా ఉన్న రోడ్లు, డ్రైనేజీ సమస్యలను తన దృష్టికి తీసుకు వచ్చారని, వారి వినతిపై స్పందించి కేవలం రెండు వారాల్లోనే శంకుస్థాపన కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. వచ్చే రెండు నెలల్లో ఈ పనులు పూర్తై ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

# అబ్దుల్ కలాం జీవితమే ఒక పాఠం : ఆళ్ల హరి




**గుంటూరు, 27 జూలై 2026, భారత్ ప్రతినిధి :** ప్రముఖ శాస్త్రవేత్త , మాజీ రాష్ట్రపతి స్వర్గీయ అబ్దుల్ కలాం తన జీవితాన్ని దేశానికి అంకితం చేసిన మహనీయుడని జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ హరి కొనియాడారు. పేపర్ బాయ్ నుంచి దేశ రాష్ట్రపతిగా ఎదిగిన అయన జీవితమే ఒక వ్యక్తిత్వ వికాస గ్రంధాలయమన్నారు. భారతదేశానికి రక్షణ కవచం లాంటి అగ్ని, పృద్వి క్షిపణులను సృష్టించి మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా వినుతికెక్కిన అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా సోమవారం పట్టాభిపురంలోని అయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. మేధస్సుకు, ప్రతిభకు పేదరికం అడ్డుకాదని నిరూపించిన స్పూర్తి ప్రధాత కలాం అని అన్నారు. విద్యార్థులు అంటే అమితంగా ఇష్టపడే కలాం తన జీవిత పర్యంతంలో కొన్ని లక్షల మందితో మాట్లాడారన్నారు. 2027 కల్లా వికసిత్ భారత్ అబ్దుల్ కలాం కోరిక అని ఆ దిశగా ప్రతీ ఒక్కరూ అడుగేయాలని కోరారు. అవినీతి లేని, విద్యా, సాంకేతికంగా బలమైన భారతదేశాన్ని నిర్మించటమే మనం అయనకిచ్చే నిజమైన నివాళి అని ఆళ్ళ హరి అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నగర కార్యదర్శి షేక్ మెహబుబ్ భాష, కోలా అంజి, నండూరి స్వామి తదితరులు పాల్గొన్నారు.

# మారుతి సుజుకి న్యూ బ్రెజ్జా కారును ఆవిష్కరించిన ఎమ్మెల్యే గళ్లా మాధవి





**గుంటూరు, 27 జూలై 2026, భారత్ ప్రతినిధి :** గుంటూరు నగరంలోని మిర్చి యార్డ్ వద్ద గల మారుతి సుజుకి షోరూం వరుణ్ మోటార్స్ నందు సోమవారం ఆల్ న్యూ బ్రెజ్జా మోడల్ కారును పశ్చిమ ఎమ్మెల్యే శ్రీమతి గళ్లా మాధవి మరియు జనసేన నాయకులు గాదె వెంకటేశ్వరరావు లాంచనంగా మార్కెట్లోకి విడుదల చేశారు.ఈ సందర్భంగా పశ్చిమ ఎమ్మెల్యే శ్రీమతి గళ్లా మాధవి మాట్లాడుతూ కారు అనగానే గుర్తొచ్చే పేరు మారుతి అని తెలిపారు.ఈ ఆల్ న్యూ బ్రెజ్జా మోడల్ కారు అత్యాధునిక భద్రతా ప్రమాణాలతో పాటు అధిక మైలేజ్ ఇస్తూ ఫైవ్ స్టార్ రేటింగ్ తో మార్కెట్లో విడుదల అయినది.ఈ కారు భారతీయ రహదారులకు అనువైనదని అత్యధిక మైలేజ్ ఇచ్చే వాహనం అని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో షోరూం మేనేజర్ కార్తికేయన్ దత్త సిబ్బంది ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో షోరూం మేనేజర్ కార్తికేయన్ దత్త సిబ్బంది కి ప్రముఖులు పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియచేశారు.

# తూర్పులో ఉత్సాహంగా "మన ఇంటికి- మన నసీర్"



**గుంటూరు, 27 జూలై 2026, భారత్ ప్రతినిధి :** రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం చేపట్టిన రెండేళ్ల పాలన- ఇంటింటికి ప్రచారంలో భాగంగా గుంటూరు తూర్పు నియోజక వర్గంలో "మన ఇంటికి- మన నసీర్" కార్యక్రమం ఉత్సాహంగా ప్రారంభమైంది. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ లీడర్ నుంచి కేడర్ వరకు ఉత్సాహంతో ముందుకు కదిలారు. సోమవారం స్థానిక ఒకటో వార్డులోని వెంకటేశ్వర కాలనీ, రజక కాలనీ, ఎంప్లాయిస్ నగర్, ఆర్టీసీ కాలనీ ప్రాంతాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గుమ్మానికి వెళ్లి ఎమ్మెల్యే నసీర్ ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అవకాశం ఉన్న ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరి ఇంటి వద్దకే సంక్షేమాన్ని తీసుకొస్తున్నామన్నారు. నియోజకవర్గంలో ప్రజల మంచినీటి అవసరాలకు శాశ్వత నిర్మాణాలు చేపట్టామన్నారు. దీంతోపాటు పార్కుల అభివృద్ధి, వాకింగ్ ట్రాక్ల నిర్మాణం వంటి పనులకు ప్రాధాన్యమిస్తున్నామని చెప్పారు. ఇది కేవలం ఇంటింటికి ప్రచారమే కాదని ప్రజలకు, ప్రభుత్వానికి వారధి నిర్మిస్తున్నామని అన్నారు. ప్రజలకు ప్రభుత్వం తోడుగా నిలుస్తుందనే నమ్మకాన్ని కలిగిస్తున్నామని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రానికి రాజధాని ఎక్కడ అని గూగుల్ అడిగినా చెప్పలేని పరిస్థితి అని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పంతో ప్రపంచస్థాయి రాజధాని నిర్మాణానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు అన్వర్, ముప్పా శైలజ, కోట పిచ్చి రెడ్డి, దిలీప్, మహంకాళి శ్రీనివాస్, గంటా సాంబ, రాజేష్, వంశీకృష్ణ, శాఖమూరి శ్రీనివాస్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్తిపాడు సబ్ రిజిస్టార్ కార్యాలయం ఎదుట 8వ రోజు దస్తావేజ్ లేఖర్ల ధర్నా



**కాకినాడ జిల్లా (ప్రత్తిపాడు), 27 జూలై 2026, భారత్ ప్రతినిధి :** ప్రత్తిపాడు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన396 జీవో రద్దు చేయాలని అలాగే జిల్లా కేంద్రంలో రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఉపసహరించుకోవాలని పత్తిపాడు దస్తావేజు లేఖర్లు నిరసన తెలియజేశారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు సబ్ రిజిస్టర్ కార్యాలయం ఆవరణలో ఈ నిరసన కార్యక్రమం 20 తేదీ నుండి ఈ నెల 31వ తేదీ వరకు కొనసాగుతుందని లేఖర్ల సంఘం అధ్యక్షుడు. పంచదారల. నాగేశ్వరరావు, అత్తి ఉమామహేశ్వరరావు తెలిపారు. సోమవారం నాటికి తమ నిరసన కార్యక్రమం ఎనిమిదవ రోజులకు చేరిందని, అనంతరం లేఖర్ల సంఘం మాట్లాడుతూ మాకు జీవన ఉపాధి దెబ్బతింటుందని ప్రభుత్వం ఆదుకోవాలని లేఖర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు సబ్ రిజిస్టర్ కార్యాలయం పరిధిలో చిలకమర్తి వెంకటరమణ భీమరెడ్డి చంటి సింగిలేని బాబ్జి మదీనా వెంకన్న దొర దిడ్డి శ్రీనివాస్ దస్తావేజు లేఖర్లు తదితరులు పాల్గొన్నారు.

# అర్హుతలైన పేదలకు పట్టాలు



**కొత్తవలస, 27 జూలై 2026, భారత్ ప్రతినిధి :** విజయనగరం జిల్లా కొత్తవలస మండలంలో 2018లో అప్పటి టిడిపి ప్రభుత్వం అర్హుతులైన పేదలకు పట్టాలు ఇచ్చిన స్థలం చూపించలేదు. సోమవారం సిపిఎం భారత్ కమ్యూనిస్ట్ పార్టీ డేగల అప్పలరాజు ఆధ్వర్యంలో తాసిల్దార్ రామలక్ష్మి కి వినతిపత్రం అందజేశారు. సిపిఎం డేగల అప్పలరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం 2018 లో టిడిపి ప్రభుత్వం ఇచ్చిన పేదలకు పట్టాలు ఇచ్చిన స్థలం చూపించలేదని లబ్ధిదారు నుండి రక్తం తీసుకొని 2018లో సర్వేనెంబర్ 173.169 లో కొత్తవలస లో పట్టాలు పంపిణీ చేశారు గత వైసిపి ప్రభుత్వం హాయంలో కొంత మంది పట్టాలు వాపసు చేసి కొత్త పట్టాలు స్థలం ఇల్లు మంజూరు చేసుకున్నారు. కానీ నేటికీ అనేక మంది స్థలములు చూపలేదు. ఇప్పటికే అనేకసార్లు కూటమి ప్రభుత్వం ఇచ్చిన తర్వాత అధికారులకు తెలియజేయునన్న ఫలితం లేదు. ఎంక్వయిరీ పేరుతో కాల యాపన చేస్తున్నారు అనేకమంది పేదలు ఇప్పుడుదరఖాస్తు చేసి ఉన్నారు. రోజు కూలి పనులు చేస్తున్నవారు ఇంటి అద్దెలు. కరెంటు బిల్లులు నిత్యవసర సరుకులు. ఇతర అవసరాలకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కోటమీ ప్రభుత్వం ఎన్నికల హామీప్రకారం పట్టణాలలో రెండుసెంట్లు గ్రామాల్లో మూడు సెంట్లు ఇల్లు కట్టుకున్నట్టుకు నాలుగు లక్షల రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చింది. దీని ప్రకారం పట్టాలు ఉన్నవారందరిని తీసుకొని మూడుసెంట్లు స్థలం ఇవ్వాలని అన్నారు.

# జీవో నంబర్ 396 వ్యతిరేకిస్తూ దస్తావేజు లేఖరులు కలెక్టరేట్ వద్ద ధర్నా




**కాకినాడ బ్యూరో, 27 జూలై 2026, భారత్ ప్రతినిధి :** జీవో నంబర్ 396 వ్యతిరేకిస్తూ దస్తావేజు లేఖరులు కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. సోమవారం రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద నుంచి ర్యాలీగా తరలి వెళ్లి కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా దస్తావేజు లేఖరులు సంఘం కాకినాడ అధ్యక్షుడు చోడపునీడి గోవిందరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్ ఎస్ కే లు ఏర్పాటు చేయడం వల్ల తమ జీవన భృతి కోల్పోతామని అన్నారు. కార్పొరేట్ సంస్థలు కు, వ్యక్తులకు రిజిస్ట్రేషన్, సర్వే లు పై పూర్తి అవగాహన ఉండదని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షలు మంది లేఖరులు ఉన్నారని, కొత్త జీ వో వల్ల ఎంతో ఇబ్బందులు పడతారని అన్నారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్ ను పరిగణనలోకి తీసుకుని జీవో నంబర్ 396 ను రద్దు చేయాలని విజ్ఞప్తి చేసారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం లో సమస్యలు తో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జాడా అప్పలరాజు యాదవ్, కాకినాడ కార్యదర్శి గీసాల శ్రీనివాస్ రావు, మేడిశెట్టి శ్రీను తో పాటు జిల్లాలో తల్లరేవు, సామర్లకోట, జగ్గంపేట, తుని, పెద్దాపురం, సామర్లకోట, పిఠాపురం తదితర ప్రాంతాలు లేఖరులు, డి టీ పీ ఆపరేటర్లు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల విశ్వాసమే కూటమి ప్రభుత్వం బలం

శాసనసభ్యులు వనమాడి కొండబాబు





**కాకినాడ బ్యూరో, 27 జులై 2026, భారత్ ప్రతినిధి :** ప్రజల విశ్వాసమే కూటమి ప్రభుత్వం బలమని, రెండేళ్ళ కూటమి ప్రభుత్వ పాలనలో నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం ప్రతి పేద వర్గానికి అందించడం జరుగుతుందని కాకినాడ సిటీ శాసన సభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ రెండేళ్లు పాలనపై రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన రెండేళ్ల నమ్మకం-సంక్షేమం-అభివృద్ధి 45 రోజుల ఇంటింటి ప్రచారంలో భాగం గా సోమవారం స్థానిక 6 వ డివిజన్ రేచర్లపేట నందు ఇంటింటి ప్రచారం నిర్వహించి గత రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ఎన్నికల హామీల మేరకు అమలు చేసిన సంక్షేమ పథకాల వివరాలను స్థానిక ప్రజలకు కొండబాబు వివరించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ గత వైసిపి పాలన వల్ల గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థను ఎన్డీఏ కూటమి ముఖ్యమంత్రి చంద్రబాబు అపార అనుభవంతో అనేక పరిశ్రమలు, వ్యాపార పెట్టుబడులతో ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తూ సమర్థ వంతమైన పరిపాలన అందించడం జరుగుతుందని, స్త్రీలకు ఉచిత బస్సు సౌకర్యం, పిల్లల చదువులకు తల్లికి వందనం ద్వారా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తూ శ్రీశక్తిని బలోపేతం చేయడం జరుగుతుందని, అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని కొండబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, క్లస్టర్ ఇంచార్జు ఓమ్మి బాలాజీ, బోనేపల్లి శ్రీనివాస్, స్థానిక నాయకులు పోలిపల్లి జగన్, బుంగా నాగరాజు, చిట్నీడి ధారా ప్రసాద్, బొడ్డుపల్లి నాని, దేవయాని, బత్తిన ఉమా, బొంతు సత్యనారాయణ ప్రసాద్, కోడి శ్రీను, పిల్లి కోదండం, సంధక బాలకృష్ణ, రాయుడు లక్ష్మణరావు, బుంగ నీలిమ, ఏడిద శ్రీను, సల్మాన్, తదితరులు పాల్గొన్నారు.

# అర్జీలు పై అధికారులు సమన్వయం తో పని చేయండి

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్



**కాకినాడ బ్యూరో, 27 జులై 2026, భారత్ ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంనకు అధికారులు అధిక ప్రాధాన్యత ఇచ్చి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టరేట్ లోని వివేకానంద హాలులో జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమములో జిల్లాకలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, జిల్లా సంయుక్త కలెక్టర్ అపూర్వ భరత్‌లతో పాటు బీసీకార్పొరేషన్ ఈడీఏ.శ్రీనివాస రావు, జిల్లా స్వర్ణ గ్రామ, వార్డు అధికారి జె.వేణుగోపాల్, జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.శ్రీధర్, డీడీఓ పి.వాసు దేవరరావు తదితరులు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.అర్జీల స్వీకరణ కు ముందుగా జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో గతంలో పీజీఆర్ఎస్ ద్వారా అందిన అర్జీలకు తీసుకున్న చర్యల పై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ లో అందిన అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లరాదని ఆదేశించారు. జిల్లా అధికారులు, మండల, మున్సిపల్ స్థాయి అధికారులు అర్జీలను వారి పరిధిలో లేనప్పుడు సంబంధిత అధికారులతో మాట్లాడి అర్జీలను పంప వలసి ఉంటుందని.. అప్పుడే సమస్యకు సంతృప్తి స్థాయిలో పరిష్కారం ఉంటుందని, ఈ విషయంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారంచూపుతూ ఎండార్స్ మెంట్ ఇచ్చే విషయం లో అధికారులు పూర్తి స్థాయి లో పరిశీలించి ఇవ్వాలని ఆదేశించారు. తల్లికి వందనం కింద లబ్ధిపొందేందుకు గ్రామ స్వర్ణ కార్యాలయం, మండల, జిల్లా స్థాయిలో అందే అర్జీలను సంబంధిత అధికారులకు పంపి పరిష్కరించేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలన్నరు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ సెక్షన్ల పర్య వేక్షకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ జి.బిందు మాధవ్



**కాకినాడ బ్యూరో, 27 జులై 2026, భారత్ ప్రతినిధి :** కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక పిజిఆర్ఎస్ కార్యక్రమంలోభాగంగా జిల్లాఎస్పీ జి.బిందు మాధవ్, మొత్తం 45 ఫిర్యాదులను స్వీకరించారు. వాటిలో భూ తగాదాలు 18, కుటుంబ కలహాలు 10మరియు ఇతర విభాగాలకు చెందినవి 17 గా గుర్తించబడ్డాయి. ఈ సందర్భంగా ఎస్పీ సంబంధిత స్టేషన్ పోలీస్ అధికారులను ఆదేశిస్తూ, "ప్రతి ఫిర్యాదును నిశితంగా పరిశీలించి వాస్తవాలు నిర్ధారించగానే, తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, 7రోజుల లోపు విచారణ పూర్తిచేసి, తగిన పరిష్కారం చూపాలని, వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి సమర్పించాలని సూచించారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను విన్న ఎస్పీ ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడమే పోలీసుల ప్రధాన కర్తవ్యమని, ప్రజా సమస్యలను న్యాయపరంగా పరిష్కరించడంలో కాకినాడ జిల్లా పోలీసులు నిబద్ధతతో పనిచేస్తున్నారని తెలిపారు.

# అమలాపురం డిగ్రీ కాలేజీ లో ఆగస్టు1న మెగా జాబ్ మేళా

జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్



**డా. బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా బ్యూరో, 27 జూలై 2026, భారత్ ప్రతినిధి :** డా. బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్ చేతుల మీదుగా మెగా జాబ్ మేళా గోడపత్రికను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాల కల్పనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి మరియు జిల్లా ఉపాధి కార్యాలయం వారి ఆధ్వర్యంలో ది అమలాపురం డిగ్రీ కళాశాల నందు ఆగస్టు 01వ తారీఖున మెగా జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ మెగా జాబ్ మేళాలో సుమారు 10 ప్రముఖ కంపెనీలతో పాటు, మరికొన్ని ఇతర కంపెనీలలో ఉద్యోగఅవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. విధకంపెనీలలో మొత్తం 600లకు పైగా ఉద్యోగావకాశాలు కల్పించడం జరుగుతుందని, 18-35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకొనుటకు అర్హులన్నారు. కంపెనీల నియమాలను అనుసరించి ఎంపిక చేస్తారని, నిరుద్యోగ యువతి యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి పందుల పెంపకం




బాపట్ల కలెక్టరేట్‌లో ఆశా వర్కర్‌పై గ్రీవెన్స్ ఫిర్యాదు

**చెరుకుపల్లి, 27 జూలై 2026, భారత్ ప్రతినిధి :** బాపట్ల జిల్లా చెరుకుపల్లి గ్రామ శివారు చెన్నకేశవ కాలనీ (ఆదర్శ కాలనీ) లోని కమ్యూనల్ సైట్ ఫ్లాట్ నంబర్లు 246, 247 ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి పందుల పెంపకం చేపడుతున్న ఆశా వర్కర్ కుంభ శివకుమారి, ఆమె భర్త శ్రీనివాసరావులపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు సోమవారం స్పందన (ప్రజా సమస్యల పరిష్కార వేదిక)లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పందుల పెంపకంవల్ల తీవ్రదుర్గంధం రావడంతో పాటు దోమలు, క్రిమి కీటకాలు వ్యాపించి రోగాల బారిన పడుతున్నామని, ఈ విషయమై ప్రశ్నించినందుకు తమపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు పెడతామని సదరు ఆశా వర్కర్ దుర్భాషలాడుతూ బెదిరింపులకు గురిచేస్తోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోవడంతో కలెక్టరేట్‌ను ఆశ్రయించామని తెలిపారు. ఫిర్యాదును పరిశీలించిన జిల్లా జాయింట్ కలెక్టర్ స్పందిస్తూ, అక్రమ పందుల పెంపకాన్ని తొలగించి ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎలక్షన్స్ లో మనం పోటీ చేసే ప్రతి స్థానం గెలిచి తీరాల్సిందే

రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ




**గుంటూరు, 27 జూలై 2026, భారత్ ప్రతినిధి :** పశ్చిమ అసెంబ్లీ లో బీజేపీ సంస్థగతంగా బలోపేతం కావటానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకు వెళ్ళాలి అని పశ్చిమ అసెంబ్లీ సంస్థాగత సమావేశంలో ముఖ్య అతిథి గా పాల్గొన్న బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి పిలుపునిచ్చారు. పశ్చిమ అసెంబ్లీ సంస్థాగత సమావేశం స్థానిక రింగ్ రోడ్ లోని సూర్యదేవర కల్యాణ మండపం లో జరిగిన కార్యాక్రమానికి పశ్చిమ అసెంబ్లీ దీూూ 1 క్రిష్టిపాటి నారాయణ రెడ్డి సభాధ్యక్షత వహించగా ముఖ్య అతిధిగా బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరి జయ ప్రకాష్ నారాయణ ప్రసంగిస్తూ అసెంబ్లీ స్థాయిలో భారతీయ జనతా పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయడానికి క్షేత్రస్థాయిలో పార్టీ నిర్మాణాన్ని పటిష్ఠం చేయడం అత్యవసరం. బూత్‌స్థాయి నుండి మండల, డివిజన్, అసెంబ్లీ స్థాయి వరకు సమన్వయం పెంచి, కార్యకర్తలను ప్రజల మధ్య మరింత చురుకుగా పనిచేయాలనీ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో కేంద్ర ప్రభుత్వం నేతృత్వంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయి. గత కొంతకాలంగా రహదారులు, డ్రెయిన్లు, మౌలిక వసతుల విస్తరణ, ప్రజా అవసరాల పరిష్కారం, మరియు వివిధ శాఖల ద్వారా పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేపట్టడం ద్వారా ప్రజల్లో విశ్వాసం పెరుగుతోంది అని అన్నారు. గుంటూరు పశ్చిమలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, నూతన మౌలిక సదుపాయాల కల్పన, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం చూపే చర్యలు ప్రజల్లో సానుకూలతను పెంచుతున్నాయి. ఈ అభివృద్ధి పనులను పార్టీ బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లి, వాటిని సమర్థవంతమైన పాలనకు ఉదాహరణగా వివరించాలి. రాబో యే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలంటే బీజేపీ ప్రతి బూత్‌లో పటిష్టమైన కమిటీలు, సమర్థవంతమైన నాయకత్వం, నిరంతర ప్రజా సంబంధాలు, మరియు కూటమితో సమన్వ యంతో ముందుకు సాగాలి. రాష్ట్ర నాయకత్వం కూడా స్థానిక ఎన్నికలను పార్టీ విస్తరణకు కీలక అవకాశంగా చూస్తూ, 100శాతం విజయ లక్ష్యంతో శ్రేణులను సన్నద్ధం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలపై వెంటనే స్పందించడానికి రాష్ట్ర పార్టీ జనతా వారిది అనే కార్యక్రమం సృష్టిం చిందని ఈ జనతా వారధి ద్వారా అనేక సమస్యలకు పరిష్కార మార్గం అధికారుల ద్వారా మనం సామాన్వయం చేస్తూ వాళ్ళు ఇచ్చినఅర్జీలను పరిష్కారం చేస్తున్నామని ఇంకా ఈజనతావారి ద్వారా ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కార మార్గ దిశగా కృషి చేయాలని అన్నారు. ముఖ్యంగా యువత, మహిళలు, చిన్న వ్యాపారులు, విద్యార్థులు వంటి వర్గా లతో ప్రత్యక్ష అనుసంధానం పెంచి, స్థానిక సమస్యలకు పరిష్కార మార్గాలు చూపాలి. సేవా కార్యక్రమాలు, కేంద్రము, రాష్ట్రము చేస్తున్న అభివృద్ధికి ప్రచారం, జరుగుతున్న పనుల వివరాలను ప్రజలకు చేరవేయడం ద్వారా పార్టీ బలం మరింత పెరుగుతుందని తద్వారా మనము ప్రజలకు మరింత చేరువవుతామని అన్నారు. రాష్ట్రకార్యదర్శి మేకల హనుమంతరావు మాట్లాడుతూ పశ్చిమఅసెంబ్లీలో మనపార్టీకి ఎక్కువ మంది నాయకుల తో పాటు ఇంకా ఎక్కువ మంది కార్యకర్తలు ఈ అసెంబ్లీలో ఉండటం మనకి మంచి పరిణామం అని జరగబోయే స్థానిక ఎలక్షన్స్ లో మనకున్న స్ట్రెంత్ ని ఉపయో గించుకొని మనం పోటీ చేసే స్థానాలపై ఎక్కువ దృష్టి పెట్టి పార్టీనీ బలో పేతం కోసం పని చేయాలని, అలాగే మన ఊరు మన జెండా ద్వారాప్రతి వార్డులోవీలైనంతగా ఎక్కువజెండా దిమ్మెలను కట్టించి జెండాలు ఎగురవేయాలని తద్వారా ఆ జెండా దిమ్మెలకి ఉన్న క్యూ ఆర్ కోడ్ ను స్కాన్ చేస్తే అక్కడ ఆ వార్డులో చేస్తున్న అభివృద్ధి కి కేంద్ర ప్రభుత్వం ఎంత నిధులు ఇస్తున్నాయో ప్రజలకు నేరుగా తెలుసుకునే అవకాశం ఉంటుందని దాని ద్వారా మన పార్టీ మరింతగా బలోపేతం అవుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చెరు కూరు తిరుపతి రావు, రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్ మకుటం శివ, నెల్లూరు జిల్లా ఇన్చార్జి చంద్రశేఖర్, SIR జిల్లా కన్వీనర్ కొత్తూరు వెంకట సుబ్బారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈదర శ్రీనివాస్ రెడ్డి, యడ్లపాటి స్వరూప రాణి, పల్నాడు జిల్లా సహించార్జి ఆవుల నాగేంద్ర యాదవ్, బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నడ్డి నాగ మల్లేశ్వరి, బజరంగ్ రామకృష్ణ, తాడువాయి రామకృష్ణ, దారా అంబేద్కర్, శ్రీదుర్గా, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# మా 'పెద్ది'ని ఎలాగైనా బతికించండి

**చేతులెత్తి వైద్యులకు విజ్ఞప్తి చేసిన కేసీఆర్**

**ఐసీయూలో మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని చూసి చలించిన బీఆర్ఎస్ అధినేత**

**చికిత్సపై యశోద డాక్టర్లతో వాకబు..**

**బెస్ట్ ట్రీట్‌మెంట్ ఇస్తున్నామన్న వైద్యులు**

**గుండె చెదరొద్దు.. ధైర్యంగా ఉండండి..**

**మాజీ ఎమ్మెల్యే భార్యాపిల్లలకు భరోసా**



**హైదరాబాద్, జూలై 27 :** 'ఏం జేస్తరో చేయండి.. అత్యుత్తమ చికిత్స అందించండి.. దయచేసి మా 'పెద్ది' ప్రాణాలు కాపాడండి' అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. యశోద హాస్పిటల్ వైద్యులకు విజ్ఞప్తిచేశారు. ఆదివారం ఉదయం తీవ్ర అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ సీనియర్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొనేందుకు సోమవారం సికింద్రాబాద్ యశోద దవాఖానకు వెళ్లారు. ఐసీయూలో బెడ్‌పై అచేతన స్థితిలో ఉన్న ఉద్యమ సహచరుడిని చూసి కేసీఆర్ చలించిపోయారు. కొంతసేపు మౌనంగా ఉన్నారు. అనంతరం వైద్యులతో కలిసి చికిత్స అందుతున్న తీరును పరిశీలించారు. డాక్టర్లతో మాట్లాడి వైద్యచికిత్సపై ఆరా తీశారు. ఎలాగైనా మా 'పెద్ది'ని బతికించండి అంటూ వైద్యులకు చేతులెత్తి నమస్కరించారు. ఆయన చేసిన విజ్ఞప్తికి వైద్యులు ఒక్కసారిగా ఖిన్నులయ్యారు. తప్పకుండా సార్.. అనుక్షణం పర్యవేక్షిస్తూ ప్రపంచస్థాయి చికిత్స అందిస్తున్నాం అని ప్రతిస్పందించారు. గుండె, ఊపిరితిత్తులు, మిగిలిన అవయవాలన్నీ సక్రమంగా పనిచేస్తున్నాయని, కొంత బ్రెయిన్ పునరుత్తేజం చెందాల్సి ఉన్నదని, అందుకు మరో 48గంటల సమయం పట్టే అవకాశం ఉన్నదని వివరించారు. అవసరం మేరకు అమెరికా సహా ఇతర దేశాల వైద్య నిపుణుల సలహాలు, సూచనలు తీసుకుంటున్నామని వారు తెలిపారు. ఎప్పటికప్పుడు ఎంఆర్ఐ, ఇతర అవసరమైన పరీక్షలు, డాక్టర్ల బృందంతో చర్చిస్తూ సుదర్శన్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిని మెరుగుపరిచేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నామని హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి, ఎండీ ఏఎస్ రావు భరోసానిచ్చారు. అయితే పూర్తిస్థాయి సమాచారం ఇవ్వడానికి మరికొంత సమయం పడుతుందని వారు వెల్లడించారు.

### దేవుడున్నడు.. డాక్టర్లున్నరు.. ధైర్యంగా ఉండండి

పెద్ది ఆరోగ్య పరిస్థితిని వాకబు చేసిన తర్వాత ఆయన పెద్ది సుదర్శన్‌రెడ్డి భార్య స్వప్న, కొడుకు నిదర్శన్‌రెడ్డి, కూతురు ధర్మిష్ఠ, సోదరులు శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సోదరి స్వాతిని కలిశారు. కేసీఆర్‌ను చూసిన వెంటనే వారు భావోద్వేగానికి లోనయ్యారు. ఉబికివస్తున్న కన్నీళ్లను దిగమింగుకుంటూ చేతులు జోడించి నమస్కరించారు. కేసీఆర్ సైతం వారిని చూసి చలించిపోయారు. 'పైన దేవుడున్నడు.. ఇక్కడ మంచి డాక్టర్లు ఉన్నరు.. అన్నీ సవ్యంగానే జరుగుతాయి.. ఆయనకు అత్యుత్తమ చికిత్స అందుతున్నది.. గుండె చెదరొద్దు.. ధైర్యంగా ఉండండి..' అంటూ వెన్నుతట్టి ఓదార్చారు. పార్టీ తరఫున అన్నివిధాల అండగా ఉంటామని, ఖర్చుకు వెనుకాడకుండా పెద్దిని కాపాడుకునేందుకు శాయశక్తులా కృషిచేస్తామని భరోసానిచ్చారు. తప్పకుండా ఆయన కోలుకొని ప్రజాజీవితంలో తిరిగి కొనసాగుతారని విశ్వాసం వ్యక్తంచేశారు.

### అరగంటకు పైగా హాస్పిటల్‌లోనే..

పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోగ్యపరిస్థితిని తెలుసుకొనేందుకు కేసీఆర్ సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎర్రవల్లిలోని తన నివాసం నుంచి బయల్దేరారు. 3.20 గంటలకు దవాఖానకు చేరుకున్నారు. సుదర్శన్‌రెడ్డికి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అక్కడే ఉండి ఎప్పటికప్పుడూ పరిస్థితులను పర్యవేక్షించాలని పార్టీ నాయకులను ఆదేశించారు. సుదర్శన్‌రెడ్డి కుటుంబ సభ్యులకు సహాయ సహకారాలు అందించాలని నిర్దేశించారు. కేసీఆర్ వస్తున్న విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో హాస్పిటల్ ప్రాంగణానికి తరలివచ్చారు. రోగుల బంధువులు కూడా ఆయనను చూసేందుకు ఉత్సాహం చూపారు. ఆవరణలోని బెంచీలు, దవాఖాన బారికేడ్లపై నిలబడి కేసీఆర్‌కు అభివాదం చేశారు. సెల్‌ఫోన్లలో ఫొటోలు తీసుకున్నారు. కొందరు యువకులు 'జై కేసీఆర్.. మళ్లీ మీరే మా సీఎం..' అంటూ నినదించారు. తరలివచ్చిన నాయకులకు అభివాదం చేస్తూ తన నివాసానికి తిరుగు పయనమయ్యారు.

కేసీఆర్ వెంట బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ లీడర్లు తన్నీరు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్, మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, తాటికొండ రాజయ్య, మాజీ ఎంపీలు జోగినపల్లి సంతోష్‌కుమార్, బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, పార్టీ ప్రధాన కార్యదర్శులు గ్యాదరి బాలమల్లు, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, ముఖ్య నేతలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, వై. సతీశ్‌రెడ్డి, రావుల శ్రీధర్‌రెడ్డి, పల్లె రవికుమార్‌గౌడ్, ఎర్రోళ్ల శ్రీనివాస్, రజినీ సాయిచంద్, వాసుదేవారెడ్డి, గజ్జెల నగేశ్, చిరుమల్ల రాకేశ్, గోసుల శ్రీనివాస్ యాదవ్, బొమ్మెర రామ్మూర్తి, అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# విద్యాసంస్కరణల్లో కేంద్రం విఫలం


**ప్రశ్నపత్రాల లీకేజీలపై రాధాకృష్ణన్ కమిటీ నివేదిక ఇప్పటికీ అతీగతీ లేదు**

**కాంగ్రెస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి కుంటుపడింది**

**కాళేశ్వరంపై ప్రభుత్వం అసత్య ప్రచారం**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్**

**ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్**



**హైదరాబాద్, జూలై 27 :** విద్యావ్యవస్థలో పారదర్శకత తీసుకురావడంలో కేంద్రం విఫలమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. దేశంలో విద్యాసంసరణలు, ప్రశ్నపత్రాల లీకేజీలపై గతంలో నియమించిన రాధాకృష్ణన్ కమిటీ నివేదిక ఏమైందో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ వెల్లడించడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఘోరమైన వైఫల్యాల వల్లే రాష్ట్ర అభివృద్ధి కుంటుపడుతున్నదని మండిపడ్డారు. ప్రభుత్వ అసమర్థత వల్లే అనేక ప్రాజెక్టులు చేజారిపోతున్నాయని విరుచుకుపడ్డారు. సోమవారం ఢిల్లీలో అక్కడి మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ చేశారు. దేశంలో విద్యాసంసరణలు, రాష్ట్రంలో కాళేశ్వరం ప్రాజెక్టు, రైల్వే ప్రాజెక్టులు, ఐటీ, సెమీకండక్టర్ల పెట్టుబడులు తదితర పలు కీలక అంశాలపై మీడియాతో ముచ్చటించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ఎండగట్టారు.

### రైల్వే ప్రాజెక్టులు నిలిచిపోయాయి

కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో కేసీఆర్ కృషితో మంజూరైన కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వే మార్గం పనులు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వేగంగా జరిగాయని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిగా నిలిచిపోయాయని కేటీఆర్ విమర్శించారు. ఈ రైల్వేమార్గాన్ని విద్యుదీకరణ సహా మిడ్‌మానేరు వద్ద రైల్వే కమ్ రోడ్ బ్రిడ్జి నిర్మాణాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆదిలాబాద్, నల్లగొండ, ఖమ్మం, నిజామాబాద్ వంటి జిల్లాల్లో ఐటీ టవర్లు నిర్మించి ఐటీని విస్తరిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని వినియోగించడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. దీంతో అనేక కంపెనీలు జిల్లాల నుంచి వెళ్లిపోతున్నాయని, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఐటీ ఉద్యోగాల సంఖ్య తగ్గిందని పేర్కొన్నారు. ఉద్యోగాలు తగ్గుతున్నాయని చెబుతున్న ప్రభుత్వం యువతకు ఏఐ, ఎమర్జింగ్ టెక్నాలజీస్ వంటి రంగాల్లో నైపుణ్య శిక్షణ ఇవ్వడంలో నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శించారు. టీ-ఫైబర్ ప్రాజెక్టును పూర్తిచేస్తే ద్వితీయ శ్రేణి నగరాల నుంచే ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీ ఉద్యోగాలు చేసే అవకాశముంటుందని, ఆ దిశగా ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు. పరకాల వంటి చిన్న పట్టణంలోనే ఒక యువ పారిశ్రామికవేత్త 250 ఉద్యోగాలు కల్పించినప్పుడు, జిల్లాకేంద్రాల్లో ప్రభుత్వం ఎందుకు అలాంటి ప్రయత్నాలు చేయడం లేదని ప్రశ్నించారు.

### సైరూట్ విజయం.. తెలంగాణకు గర్వకారణం

సైరూట్ రాకెట్ విజయానంతరం సంస్థ వ్యవస్థాపకులు ఫోన్ చేసి కృతజ్ఞతలు చెప్పడం తన ఆనందం కలిగించిందని కేటీఆర్ చెప్పారు. ఎలాన్ మస్ ఎన్నో సంవత్సరాల ప్రయత్నంలో సాధించలేని సక్సెస్‌ను సైరూట్ తొలి ప్రయత్నంలోనే సాధించిందని, ఇందులో తెలంగాణ యువత కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు.

### పెట్టుబడులను కేంద్రం అడ్డుకుంటున్నది

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సెమీకండక్టర్ అనుబంధ పరిశ్రమలకు పునాది పడిందని, కానీ రాజకీయ కారణాలతో తెలంగాణకు రావాల్సిన పెట్టుబడులను కేంద్రం బీజేపీ పాలిత రాష్ట్రాలకు మళ్లించిందని కేటీఆర్ ఆరోపించారు. హైదరాబాద్‌లో పెట్టుబడి పెట్టేందుకు దావోస్‌లో సిద్ధమైన అమెరికా చిప్ డిజైన్ కంపెనీపై కేంద్ర మంత్రులు ఒత్తిడి తెచ్చి పీఎల్ఐ ప్రోత్సాహకాలు ఇవ్వబోమని హెచ్చరించడంతో ఆ పెట్టుబడి తెలంగాణకు రాకుం డా పోయిందని మండిపడ్డారు. మైక్రాన్, శాంసంగ్, కేన్స్ వంటి కీలక సంస్థలను గుజరాత్‌కు తరలించారని, ఫ్యాబ్, సెమీకండక్టర్ రంగాల్లో రాష్ట్ర వచ్చే ప్రతి పెట్టుబడినీ కేంద్రం అడ్డుకున్నదని ఆరోపించారు.

### కాళేశ్వరంపై తప్పుడు ప్రచారం

కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నదని కేటీఆర్ ధ్వజమెత్తారు. ప్రస్తుతం కన్నెపల్లి వద్ద నీటిని ఎత్తిపోసేందుకు తగిన నీటిమట్టం ఉన్నా, ప్రభుత్వం కావాలనే ఎత్తిపోయడం లేదని మండిపడ్డారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో గ్రౌటింగ్ పూర్తయిన తర్వాత పరిమిత స్థాయిలో నీటిని నిల్వ ఉంచి మూడు పంప్‌హౌస్‌ల ద్వారా నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నదని రిటైర్డ్ ఇంజినీర్లు, ప్రభుత్వ ఇంజినీర్లు స్పష్టంచేసినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. తమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించకపోవడం వల్లే కాళేశ్వరం ప్రాజెక్టును రీ డిజైన్ చేయాల్సి వచ్చిందని కేటీఆర్ వివరించారు. కాంగ్రెస్ ప్రతిపాదించిన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు ఆచరణ సాధ్యం కాదని, 16 టీఎంసీల నీటి కోసం వందల కిలోమీటర్ల దూరం తరలించే పరిస్థితి ఉండేదని పేర్కొన్నారు. అందుకే 142 టీఎంసీల సామర్థ్యం, తగిన నిల్వ సామర్థ్యం ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టును రూపొందించామని చెప్పారు.

# సిరిసిల్ల విద్యార్థికి కెటిఆర్ అండ

**ఐఐటిలో సీటు సాధించినందుకు అభినందన**

**ల్యాప్‌టాప్ బహుకరణ..ఫీజు చెల్లింపునకు హామీ**

**హైదరాబాద్,జూలై27 :** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి తన ఔదార్యం చాటుచేసుకున్నారు. ఐఐటీ వారణాసిలో సీటు సాధించిన సిరిసిల్లకు చెందిన గడదాస్ అభినవ్‌కు గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమం ద్వారా ల్యాప్‌టాప్‌ను బహూకరించారు. కాలేజీ ఫీజును కూడా తానే భరిస్తానని హామీ ఇచ్చారు. సిరిసిల్లకు చెందిన గడదాస్ అభినవ్ తన తల్లిదండ్రులు లక్ష్మీనారాయణ, శ్రీలతతో కలిసి హైదరాబాద్‌లో కేటీఆర్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఐఐటీ వారణాసిలో సీటు సాధించిన అభినవ్‌ను కేటీఆర్ శాలువాతో సత్కరించారు. అనంతరం గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమం కింద ల్యాప్‌టాప్ అందజేశారు. అంతేకాకుండా అభినవ్ కాలేజీ ఫీజును కూడా తానే చెల్లిస్తానని భరోసా ఇచ్చారు.

కేవలం చదువు మీద దృష్టి పెట్టి.. తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని, జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అభినవ్‌కు కేటీఆర్ సూచించారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు అభినవ్, అతని తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. తమ కుటుంబానికి అందించిన ప్రోత్సాహాన్ని ఎప్పటికీ మరువబోమని,

కేటీఆర్‌కు రుణపడి ఉంటామని అన్నారు.

# ఫీజు రియంబర్స్‌మెంట్ చెల్లింపులో విఫలం

**విద్యారంగ సమస్యల పరిష్కారంలో అలసత్వం**

**యువ ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి విద్యాశాఖ అప్పగించాలి**

**బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు డిమాండ్**

**హైదరాబాద్,జులై 27:** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థి, యువత జీవితాలతో సీఎం రేవంత్ రెడ్డి చెలగాటమాడుతున్నారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు మండిపడ్డారు. మరోవైపు యువత ఎన్నికల్లో పోటీ చేసేలా వయసును 21 ఏళ్లకు తగ్గించాలని కొత్త డ్రామా షురూ చేశారని విమర్శించారు. ఈ క్రమంలో విద్యాశాఖ వైఫల్యాన్ని అంగీకరిస్తూ యువ ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి విద్యాశాఖను కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యాశాఖ, హోంశాఖ, న్యాయశాఖ తదతర శాఖలను సిఎం సమర్థంగా నిర్వహించలేకపోతున్నారని ఆయన మీడియా సమావేశంలో మండిపడ్డారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఖర్గేను తీసేసి యువనేతను ఎన్నుకోవచ్చు కదా..? అని ప్రశ్నించారు. భాజపా జాతీయ అధ్యక్షుడిగా యువ నాయకుడు నితిన్ నబీన్‌ను చేశామని గుర్తు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశాన్ని డైవర్ట్ చేయడానికే.. 21 ఏళ్లకు పోటీ అంశాన్ని తెరపైకి తెచ్చారని విమర్శించారు. యువతకు నిరుద్యోగ భృతి, స్కూటీ, రెండు లక్షల ఉద్యోగాలు ఎక్కడికి వెళ్లాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి... విద్యా శాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసి నిజాయితీ చాటుకున్నారని, తెలంగాణలో రూ.12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి చెల్లించకుండా తాత్సారం చేస్తున్న రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసి చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. విద్యార్థులు, యువత జీవితాలతో చెలగాటమాడు తున్న రేవంత్ రెడ్డి సర్కార్ క్యాండిల్ ర్యాలీలు చేయడం సిగ్గుచేటని, భవిష్యత్తులో అదే క్యాండిల్‌తో విద్యార్థులు, యువత వారిని తగలబెడతారన్నారు. ఢిల్లీలో జరిగిన విద్యార్థుల నిరసనల్లో విదేశీ హస్తం ఉందని ఆరోపించారు. యువత, కాంగ్రెస్ నిరసనలతో కేంద్రం దిగి వచ్చిందనే మాటలు అవాస్తమన్నారు. యువతకు 21 ఏళ్లకే ఎమ్మెల్యేలు, ఎంపీలుగా పోటీ చేసే అవకాశం ఇవ్వాలన్న రేవంత్ వ్యాఖ్యలను రాంచందర్‌రావు ఖండించారు. ఎన్నికల వయోపరిమితిపై నిర్ణయం తీసుకునే అధికారం సీఎంకు లేదని, ఈ అంశం కేంద్ర ఎన్నికల సంఘం, కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉంటుందన్నారు. యువతను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు మానుకోవాలని సూచించారు.

# సింగరేణిని భ్రష్టు పట్టించిన కేసీఆర్

**కాంగ్రెస్ వచ్చినా మారని పరిస్థితి.. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శలు**

**న్యూఢిల్లీ,జూలై27:** గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణికి తీవ్ర నష్ట చేకూర్చిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా సింగరేణి మెరుగుపడటం లేదని వ్యాఖ్యానించారు. కేంద్రం 49 శాతం, తెలంగాణ ప్రభుత్వం 51 శాతం వాటాతో సింగరేణి కొనసాగుతోందని కేంద్ర మంత్రి తెలిపారు. దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద బొగ్గు కంపెనీ సింగరేణి అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. సింగరేణి నుంచి కర్ణాటక, ఏపీ, మహారాష్ట్ర, ఎన్‌టీపీసీ కి బొగ్గు సరఫరా అవుతుందని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్.. సింగరేణికి తీరని ద్రోహం చేశారని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి ఆదాయానికి గత ప్రభుత్వం గండికొట్టిందని ఆరోపించారు. రాజకీయ వేదికలకు సింగరేణిని వాడుకున్నారంటూ బీఆర్ఎస్, కేసీఆర్‌పై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వింత ప్రవర్తన, మొండి వైఖరి వల్లే సింగరేణి సంస్థ తీవ్రంగా నష్టపోయిందని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2014లో సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా బొగ్గు గనులను పారదర్శకంగా వేలం పాట ద్వారా కేటాయించాలని ఆదేశించినప్పటికీ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం వేలం పాటల్లో పాల్గొనకుండా నిర్లక్ష్యం వహించిందన్నారు. నూతన బొగ్గు బ్లాకులు లభించక, ఆదాయ మార్గాలు మూసుకుపోయి సింగరేణి వెనుకబడిపోవడానికి కేసీఆర్ ద్రోహమే కారణమని ఆయన ఆరోపించారు. సంస్థను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారని, గతంలో కేంద్రం ఇచ్చే రూ. 525 కోట్ల నిధులను సక్రమంగా వినియోగించుకోలేకపోయారని విమర్శించారు. 2015లోనే ఒడిశాలోని నైని కోల్ బ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం సింగరేణికి కేటాయించినప్పటికీ, నాటి కేసీఆర్ ప్రభుత్వం ఒడిశా ముఖ్యమంత్రితో కనీసం మాట్లాడలేదని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. అయితే, ఇటీవల ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాము చొరవ తీసుకుని నైని కోల్ బ్లాక్‌కు సంబంధించి అవసరమైన అన్ని అనుమతులను ఇప్పించినట్లు వెల్లడించారు. అలాగే తాడిచర్ల-2 బ్లాక్‌ను కూడా కేంద్రం సింగరేణికి కేటాయించిందని, మణుగూరులోని ఒక బ్లాక్‌ను వేలంలో ఉంచామని తెలిపారు. అయితే ఈ వేలంలో సింగరేణికి పోటీగా తెలంగాణ జెన్కో పాల్గొనడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. జెన్కో టెండర్ నుంచి తప్పుకుని, ఆ బ్లాకులు సింగరేణికి దక్కేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై సీఎంకు లేఖ రాయనున్నట్లు వెల్లడించారు. ఈ మూడు కొత్త బ్లాకులు సింగరేణికి దక్కితే సుమారు 6,500 మందికి ఉద్యోగావకాశాలు రావడంతో పాటు, 830 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగి, దాదాపు రూ. 1.95 లక్షల కోట్ల టర్నోవర్‌తో సంస్థకు, రాష్ట్ర ప్రభుత్వానికి భారీగా ఆదాయం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పబ్లిక్ పరీక్షల చట్టం గురించి మాట్లాడుతూ.. 2024లోనే ఎలాంటి డిమాండ్లు, నిరసనలు లేకపోయినా ముందస్తు జాగ్రత్తగా ఈ యాంటీ-పేపర్ లీక్ బిల్లును తీసుకొచ్చామని తెలిపారు. భవిష్యత్తులో ఎవరైనా పేపర్ లీకేజీలకు పాల్పడాలంటే భయపడేలా, గుండెలాగిపోయే స్థాయిలో అత్యంత కఠినమైన నిబంధనలతో ఈ చట్టాన్ని రూపొందించామని చెప్పారు. విద్యా వ్యవస్థలో మార్పుల కోసం ప్రతిపక్ష కాంగ్రెస్ కూడా స్వాగతిస్తుందని భావిస్తే, వారు చట్టాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయడం విచారకరమన్నారు. ఫలితాలు వచ్చిన వేళ నిరాశతో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వారిలో ధైర్యాన్ని నింపాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చివరగా, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన దాడి ఘటన తీవ్ర బాధాకరమని, దీనిపై ప్రస్తుతం సుప్రీంకోర్టు విచారణ జరుపుతోందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# మెట్రో ప్రయాణికలుకు మెరుగైన సేవలు

**అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి. అజిత్ రెడ్డి**

**హైదరాబాద్,జూలై27 :** హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు మరింత మెరుగైన, సౌకర్యవంతమైన సేవలు అందించడమే లక్ష్యంగా హైదరాబాద్ మెట్రో రైల్ అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి. అజిత్ రెడ్డి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. స్టేషన్లను అన్ని విధాలా తీర్చిదిద్దేందుకు వెంటనే ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన సూచించారు. ఈ మేరకు బేగంపేట్ నుంచి రాయదుర్గ్ వరకు మెట్రోలో స్వయంగా ప్రయాణించి, పలు కీలక స్టేషన్లను, అక్కడి వీధి స్థాయి వసతులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పర్యటనలో భాగంగా బేగంపేట్, అమీర్ పేట్, రాయదుర్గ్ మెట్రో స్టేషన్లలోని ఎ÷-లాట్‌ఫామ్‌లు, కాంకోర్స్ ప్రాంతాలను అజిత్ రెడ్డి సందర్శించారు. అక్కడ ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లపై మెట్రో ఇంజనీర్లు , ఆపరేషన్ల నిర్వాహక సంస్థ కియోలిస్ అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాయదుర్గ్ వద్ద ఉన్న స్కైవాక్, ఐటీ కంపెనీలకు ఉన్న కనెక్టివిటీ మార్గాలు , మైండ్‌స్పేస్ జంక్షన్ వద్ద ప్రయాణికుల రాకపోకలను ఆయన ప్రత్యేకంగా పరిశీలించారు. ఉదయం, సాయంత్రం రద్దీ వేళల్లో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మరింత పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని, అలాగే స్టేషన్ల కింద ఉన్న వాణిజ్య సముదాయాల నిర్వహణ సరిగ్గా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మెట్రో స్టేషన్ల కింద ఉన్న పార్కింగ్ స్థలాల వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని, బేగంపేట్, అమీర్ పేట్, రాయదుర్గ్ పార్కింగ్ ఏరియాలను పరిశీలించి అభివృద్ధికి తగిన సూచనలు చేశారు. అలాగే, పిల్లర్ల మధ్య ఉన్న సెంట్రల్ మెరిడియన్ నిర్వహణ , పారిశుధ్య స్థితిగతులపై ఆయన సమీక్షించారు.

6

# శాంతియుత నిరసనలు తెలిపే హక్కు ఉంది

### ఇది ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం ఇచ్చిన భరోసా

### చీఫ్ జస్టిస్ జస్టిస్ సూర్యకాంత అభిప్రాయం

**న్యూఢిల్లీ :** నీట్ పేపర్ లీక్ కేసుకు సంబంధించి విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్ వ్యవహారంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కల్పిస్తుందని, కేవలం నిరసన వ్యక్తం చేస్తున్నారనే కారణంతో పోలీసు బలప్రయోగానికి పాల్పడకూడదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. జూలై 20న 'సంసద్ చలో' కార్యక్రమంలో భాగంగా నీట్ పేపర్ లీక్ కేసుపై న్యాయం కోరుతూ విద్యార్థులు నిర్వహించిన నిరసన సందర్భంగా పోలీసులు లాఠీచార్జ్ చేయడంతో పాటు టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘటనపై స్వతంత్ర విచారణ జరపాలని కోరుతూ పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు రాజ్యాంగబద్ధ హక్కులపై కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా చీఫ్ జస్టిస్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగం శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును పౌరులకు కల్పించిందని పేర్కొంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో తమ అభిప్రాయాలను శాంతియుతంగా వ్యక్తం చేసే స్వేచ్ఛ ప్రతి పౌరుడికి ఉందని స్పష్టం చేసింది. అలాగే, కేవలం నిరసన జరుగుతోందనే కారణంతోనే లాఠీచార్జ్ లేదా బలప్రయోగాన్ని సమర్థించలేమని కోర్టు వ్యాఖ్యానించింది. విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగంపై స్వతంత్ర విచారణ జరపాలని పిటిషనర్లు కోరారు. ఈ ఘటనలో పోలీసులు అనుసరించిన విధానంపై ప్రశ్నలు లేవనెత్తుతూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య దేశంలో శాంతియుత నిరసనలు ప్రజల ప్రాథమిక హక్కుల్లో భాగమని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు నిరసనలు ఒక ప్రజాస్వామ్య మార్గమని, అలాంటి సందర్భాల్లో చట్టాన్ని అమలు చేసే సంస్థలు కూడా రాజ్యాంగబద్ధ హక్కులను గౌరవిస్తూ వ్యవహరించాలని అభిప్రాయపడుతున్నారు. సుప్రీంకోర్టు తాజా వ్యాఖ్యలు నిరసన హక్కు, పోలీసుల చర్యల పరిమితులపై మరోసారి దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి.

# విజయ్ ప్రభుత్వానికి మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ

### ప్రభుత్వ ఉద్యోగాలు అంగడి సరుకు కాదు

### కరూరు బాధితులకు ఉద్యోగాల కల్పపై ఆక్షేపణ

**చెన్నై :** తమిళనాడు సిఎం విజయ్ ప్రభుత్వానికి మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. కరూర్ తొక్కిసలాటలో మృతి చెందిన వారి కుటుంబాలకు ఇచ్చిన ఉద్యోగాలు చెల్లవని ఉన్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది. రాజ్యాంగ పరిమితులకు లోబడి ప్రభుత్వం వ్యవహరించాలని సూచించింది. ప్రభుత్వ చర్యలపై నియంత్రణ లేకపోతే.. అరాచకం, అశాంతి రాజ్యమేలుతాయని పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగం అనేది ఉచితంగా పంచిపెట్టేది కాదు. దాన్ని కష్టపడి సాధించాలి. ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎంతోమంది ఎదురుచూస్తున్నారని వ్యాఖ్యానించింది. గతేడాది సెప్టెంబర్‌లో జరిగిన టీవీకే ర్యాలీలో చోటుచేసుకున్న తొక్కిసలాటలో 41 మంది మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బాధితుల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని విజయ్ హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మరోసారి కరూర్ వెళ్లి అర్హతలున్న 32 మందికి వివిధ ప్రభుత్వ శాఖల్లో తాత్కాలిక నియామక పత్రాలను అందజేశారు. దీనిపై అన్నాడీఎంకే నేత ఆర్.బి. ఉదయ్‌కుమార్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. చట్టపరమైన విధానాలను పక్కనపెట్టి తాత్కాలిక ప్రాతిపదికన ఉద్యోగాలు ఇచ్చారంటూ హైకోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎంతో మంది యువత తీవ్రంగా శ్రమిస్తున్నారని, ప్రభుత్వం ఏ ఉద్యోగ నియమాక ప్రక్రియ చేపట్టినా తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారానే చేపట్టాలని కోరారు. దీనిపై తాజాగా విచారణ చేపట్టి న్యాయస్థానం సీఎం విజయ్ చేపట్టిన ఈ నియామకాలు చెల్లబోవని తీర్పునిచ్చింది.

# క్రైస్తవంలోకి మారితే ఎస్సీ హోదా కట్

### రివ్యూ పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీం

**న్యూ ఢిల్లీ :** ఎస్సీ హోదాపై దాఖలైన రివ్యూ పిటిషన్ ను సోమవారం సుప్రీంకోర్టు కొట్టివేసింది. హిందూ, సిక్కు, బౌద్ధమతం కాకుండా వేరే మతంలోకి మారిన షెడ్యూల్డ్ కులానికి చెందినవారు తమ ఎస్సీ హోదా కోల్పోతారని సుప్రీంకోర్టు ఇంతకు ముందు తీర్పుచెప్పింది. దీన్ని సవాల్ చేస్తూ దాఖలైన రివ్యూపిటిషన్ను జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్ ధర్మాసనం తాజాగా తిరస్కరించింది. 2026 మార్చి 24న తాము ఇచ్చిన తీర్పును పరిశీలిం చామని, అందులో ఎలాంటి తప్పులు కనిపించలేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 1950 నాటి రాజ్యాంగ షెడ్యూల్డ్ కులాల ఉత్తర్వులోని క్లాజ్ 3 కింద ఉన్న ఈ నిబంధన స్పష్టమైనది, సంపూర్ణమైనది. నిర్దేశిత మతాలు కాకుండా వేరే మతంలోకి మారితే పుట్టుకతో సంబంధం లేకుండా ఎస్సీ హోదా తక్షణమే. పూర్తిగా రద్దు అవుతుందని కోర్టు తేల్చి చెప్పింది. ఎస్సీ హోదా పోతే ఆ ప్రయోజనాలన్నీ వదులుకోవాల్సి వస్తుందని, షెడ్యూల్డ్ తెగకు చెందిన వ్యక్తి వేరే మతంలోకి మారితే కాలక్రమేణా ఆ తెగ ఆచారాలు, సంప్రదాయాలు, సంస్కృతి, ఇతర లక్షణాలు అంతరించిపోయే అవకాశం ఉందని కోర్టు పేర్కొంది. ఒకవ్యక్తి తన తెగ, ఆచారాలను వదిలివేసి, మారిన మతంలోని పద్ధతులను అవలంబిస్తున్నట్లు రుజువు అయితే, ఆ వ్యక్తిని ఇకపై ఆ తెగలో భాగంగాపరిగణించలేమని న్యాయస్థానం పేర్కొంది. ఒక వ్యక్తి క్రైస్తవ మతంలోకి మారిన వెంటనే, ఎస్సీ హోదాను తక్షణమే పూర్తిగా కోల్పోతారని గతంలో ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 342 క్లాజ్ (1) ప్రకారం, వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో గుర్తింపు పొందిన తెగలను నిర్ధరిస్తూ రాష్ట్రపతి 1950 నాటి రాజ్యాంగ (షెడ్యూల్డ్ తెగ) ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వు ప్రకారం, ఒక వ్యక్తి ఆ తెగకు చెందిన సంప్రదాయాలను నిజాయితీగా కొనసాగిస్తేనే ప్రయోజనాలు పొందగలరు. ఒకవేళ మత మార్పిడి జరిగినా లేదా తెగ ఆచారాలను దీర్ఘకాలంగా వదిలివేయడంవల్ల వారి గుర్తింపు రద్దు అవుతుంది. లేదా విచారణ ద్వారా ఆ గుర్తింపు ఉంచాలా, వద్దా అనేది తేల్చాల్సి ఉంటుందని అని న్యాయస్థానం స్పష్టం చేసింది. అలాగే హిందూ, సిక్కు లేదా బౌద్ధ మతాన్ని కాకుండా నేరే మతాన్ని అవలంభించే ఏ వ్యక్తినీ షెడ్యూల్డ్ కులానికి చెందిన వ్యక్తిగా పరిగణించలేమన్నారు. 1950 నాటి ఉత్తర్వుల ప్రకారం, ఒక వ్యక్తి ఎస్సీ హోదా కోల్పోయినప్పుడు, ఆ హోదా ఆధారంగా లభించే చట్టబద్ధమైన ప్రయోజనాలు, రక్షణలు, రిజర్వేషన్లు, అర్హతలు అన్నీ తక్షణమే, స్వయంచాలకంగా రద్దు అవుతాయని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ 1950 నాటి ఉత్తర్వు కేవలం హిందూ మతాన్ని అవలంబించే వారికి మాత్రమే ఎస్సీ హోదాను పరిమితం చేసింది. ఆ తర్వాత 1956లో సిక్కులను, 1990లో బౌద్ధులను ఇందులో చేర్చుతూ సవరణలు చేశారు. ఈ సవరణల్లో ఎక్కడా క్రైస్తవ మతాన్ని చేర్చలేదు అనే విషయాన్ని గమనించాలి. క్రైస్తవ మత సిద్ధాంతాల ప్రకారం కుల వ్యవస్థకు గుర్తింపు లేదు అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. షెడ్యూల్డ్ కులం లేదా తెగ హోదాను కోరే వ్యక్తి, 1950 ఉత్తర్వుల ప్రకారం, నోటిఫై చేసిన కులానికి లేదా తెగకు చెందినవారై ఉండాలి. అంతేకాదు దానికి సంబంధించిన స్పష్టమైన, తిరుగులేని ఆధారాలను సమర్పించాల్సి ఉంటుందని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. ఒక వ్యక్తి నిర్దేశిత మతాలు కాకుండా, వేరే మతాన్ని పాటిస్తూ, అదే సమయంలో ఎస్సీ హోదా ప్రయోజనాలను చట్టబద్ధంగా పొందలేరని స్పష్టం చేసింది.

# పార్లమెంటులో కొనసాగిన ప్రతిష్టంభన

### మోడీ, అమిత్ షాల క్షమాపణలకు పట్టు

### గందరగోళం మధ్యే సభ ముందుకు పేపర్ లీకేజ్ సవరణ బిల్లు

### బిల్లును ప్రవేశ పెట్టిన కేంద్రమంత్రి జితేంద్ర సింగ్

### బిల్లు ప్రాధాన్యం దృష్ట్యా చర్చకు అనుమతించిన స్పీకర్

### విపక్ష సభ్యుల ఆందోళనతో సభను వాయిదా వేసిన స్పీకర్ ఓంబిర్లా




**న్యూఢిల్లీ :** పార్లమెంట్ ఉభయసభల్లో గందరగోళం కొనసాగింది. విద్యార్థులపై కేసులు ఎత్తివేత మొదలు, లాఠీఛార్జికి నిరసనగా ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షాలు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ ఉభయ సభల్లో సభ్యులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో ఉభయ సభలు వాయిదా పడ్డాయి. గందరగోళం మధ్యే ప్రభుత్వం పేపర్ లీకేజీల సవరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశ పెట్టింది. దీనిపై మాట్లాడేందుకు స్పీకర్ ఆహ్వానించినా విపక్షాలు ముందుకు రాలేదు. నీట్-యూజీ సహా పలు పోటీ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలు, అక్రమాలపై దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వ్యక్తమైన వేళ పరీక్షల భద్రతను మరింత పటిష్ఠం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగేసింది. ఇప్పటికే అమల్లో ఉన్న 2024 చట్టాన్ని మరింత కఠినతరం చేస్తూ యాంటీ పేపర్ లీక్(సవరణ) బిల్లును సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. దీనిని ప్రధానమంత్రి కార్యాలయ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ సభ ముందుంచారు. ఈ సవరణల ద్వారా నిందితులకు కఠిన శిక్ష విధించడం సహా వేగవంతమైన దర్యాప్తు, నిర్దిష్ట కాలవ్యవధిలో విచారణ పూర్తయ్యేలా నిబంధనలను రూపొందించారు. ఇకపై ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి, రోజువారీ విచారణల తో కేసులను 90 రోజుల్లో పూర్తిచేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టం ప్రకారం మూడు నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. కొత్త బిల్లులో దానిని గరిష్ఠంగా పదేళ్లకు పెంచారు. దీంతో పాటు ఇప్పటివరకు గరిష్ఠంగా రూ.10 లక్షలుగా ఉన్న జరిమానా.. నూతన చట్టంలో రూ.10 కోట్లకు పెరగనుంది. ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై ఇప్పటివరకు కేంద్ర దర్యాప్తు సంస్థలు విచారణ చేపట్టేవి. కానీ ఇకపై ఇలాంటి అక్రమాలపై స్పెషల్ టాస్క్ ఫోర్స్(ఎస్‌టీఎఫ్) ప్రత్యేక దర్యాప్తు చేపట్టనుంది. ఇప్పటివరకు దర్యాప్తు పూర్తి చేసేందుకు నిర్దిష్ట గడువు ఉండేది కాదు. కొత్త బిల్లు ప్రకారం.. రెండు నెలల్లోనే విచారణ పూర్తిచేయడం తప్పనిసరి కానుంది. పేపర్ లీక్ కేసుల విచారణ కోసం ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు కానున్నాయి. రోజువారీ విచారణలో భాగంగా కేసులను మరింత వేగంగా పరిష్కరించనున్నారు. కొత్త బిల్లు ప్రకారం.. కేసు నమోదయ్యాక మూడు నెలల్లో తీర్పును వెలువరించాలి. హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసుకునేందుకు 30 రోజుల గడువు నిర్ణయించారు. అప్పీల్‌పై కూడా 90 రోజుల్లోనే తీర్పు ఇవ్వాల్సి ఉంటుంది. పరీక్షల్లో పారదర్శకతను పెంచడం సహా ప్రశ్నపత్రాల లీకేజీలను పూర్తిగా అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల పలుమార్లు చెప్పారు. నయా టెక్నాలజీ ద్వారా పరీక్షల భద్రతను మరింత పటిష్ఠం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం సహా సాంకేతిక సంస్కరణలు, దీర్ఘకాలిక నిర్మాణాత్మక మార్పులపై సిఫార్సులు చేసేందుకు నందన్ నీలేకణి ఆధ్వర్యంలో ఆరుగురు సభ్యులతో ఓ ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటుచేసింది కేంద్రం. దీంతో పాటు కేంద్ర విద్యాశాఖ లోనూ మార్పులు చోటుచేసుకున్నాయి. నూతన విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ప్రహ్లాద్ జోషి..

పరీక్షల నిర్వహణలో పారదర్శకత, బాధ్యతాయుత వ్యవస్థను బలోపేతం చేస్తామని చెప్పారు.

కాగా.. పరీక్షల అక్రమాలపై కేంద్రం ఇప్పటికే పాలనాపరమైన చర్యలు ప్రారంభించింది. జాతీయ పరీక్షల సంస్థ(ఎన్‌టీఏ)లో 47 మంది అధికారులను తొలగించినట్లు సమాచారం. అలాగే పరీక్షల నిర్వహణ విధానంలో మార్పులు, ఔట్‌సోర్సింగ్ వ్యవస్థలో సంస్కరణలు, సాంకేతిక భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ నేడు ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. విపక్షాల ఆందోళనల నడుమే ఈ బిల్లు సభ ముందుకు వచ్చింది. అనంతరం లోక్‌సభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. ఈ బిల్లుపై సూచనలను మధ్యాహ్నం ఒంటిగంటల వరకు సమర్పించవచ్చని స్పీకర్ ఓంబిర్లా సభ్యులకు తెలిపారు. అలా సవివర చర్చకు తగిన సమయం ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ బిల్లు ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమైందని, దీనిపై చర్చ నుంచి సభ దృష్టి మళ్లకుండా చూడాలని విపక్షాలకు సూచించారు. మరోవైపు, ఈ బిల్లుపై ప్రతిపక్షాలు విమర్శలు వ్యక్తం చేస్తున్నాయి. ఇదంతా పైపై మెరుగు అని మండిపడ్డాయి. అదే సమయంలో ధర్మేంద్ర ప్రధాన్‌కు పార్లమెంట్‌లో ఘన స్వాగతం పలకడాన్ని తప్పుపట్టాయి. జులై 20న 'చలో సంసద్' పేరిట చేపట్టిన నిరసనల్లో విద్యార్థులపై లాఠీఛార్జి చేయడాన్ని ఖండించాయి. దానిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని విపక్ష నేతలు డిమాండ్ చేశారు. నీట్ సహా పలు పరీక్షల పేపర్‌లు లీక్ కావడంతో దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతోన్న సంగతి తెలిసిందే. దాంతో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే కేంద్రం తాజా బిల్లును తీసుకొచ్చింది.

# కేంద్రం హామీలు బుట్టదాఖలు

### కేసుల ఎత్తివేతపై కదలిక లేని ఉత్తర్వులు

### ఇలాగే వ్యవహరిస్తే మళ్లీ ఆందోళనలు

### న్యాయసాయం కోసం సాక్షి ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ప్రారంభం


### కాక్రోచ్ జనతాపార్టీ నేతల వెల్లడి

**న్యూఢిల్లీ :** నిరసనకారులపై పోలీసు చర్యలు కొనసాగుతున్నాయని, కేసుల ఉపసంహరణపై కేంద్రం తమకు ఇచ్చిన మాటను ఉల్లంఘిస్తోందని 'కాక్రోచ్ జనతా పార్టీ' ఆరోపించింది. మళ్లీ దేశవ్యాప్త నిరసనలు ప్రారంభిస్తామని హెచ్చరించింది. కేంద్ర విద్యశాఖ మంత్రిగా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత సీజేపీ తన నిరసనను విరమించింది. కేంద్రంతో చర్చల సమయంలో విద్యార్థులపై కేసులు ఎత్తివేతపై కేంద్రం అంగీకరించిందని సీజేపీ చెబుతోంది. కేసులు విత్ డ్రా చేయకుపోతే నేటి నుంచి మళ్లీ ఉద్యమిస్తామని హెచ్చరించారు. నిరసనకారులపై నమోదైన అన్ని ఎఫ్ఐఆర్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని, అదుపులోకి తీసుకున్న విద్యార్థులను విడుదల చేయాలని మరియు వాలంటీర్లపై నిఘా, వేధింపులను ఆపాలని సీజేపీ డిమాండ్ చేసింది. నిరసనకారులపై ఎలాంటి చర్యలు తీసుకోబోమని ప్రభుత్వం ఇచ్చిన హామీని ఉల్లంఘిస్తోదని సీజేపీ ప్రతినిధి అశుతోష్ రాంకా ఎక్స్‌లో ఆరోపించారు. బీహార్, బెంగాల్‌లలో వందలాది విద్యార్థులను అరెస్ట్ చేస్తున్నారని, ఢిల్లీ, ఇతర రాష్ట్రాల్లో వందలాది మందిపై నిఘా ఉంచి వేధిస్తున్నారని, నిరసనకారులకు లాజిస్టిక్స్ సపోర్ట్ అందించిన వాలంటర్లను వేధిస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు కాక్రోచ్ జనతా పార్టీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ కీలక వ్యాఖ్యలు చేశారు. కేసుల్లో చిక్కుకున్న విద్యార్థుల న్యాయసహాయం కోసం 'సాక్షి' అనే ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ప్రారంభించినట్లు సీజేపీ ప్రకటించింది. తమకు ఇచ్చిన హామీని కేంద్రం నిలబెట్టుకోవట్లేదని ఆరోపించారు. పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసన చేపట్టిన ఆందోళనకారులపై నమోదైన కేసులు ఉపసంహరించుకుంటామని కేంద్ర మంత్రులు తమకు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అందువల్లే తాము నిరసనలు నిలిపివేశామన్నారు. కానీ, ఇంతవరకూ విద్యార్థులు, ఇతర నిరసనకారులపై పెట్టిన కేసులను ఎత్తివేయలేదని తెలిపారు. అస్సాం, పశ్చిమ బెంగాల్, బిహార్ వంటి రాష్ట్రాల్లో పలువురు ఆందోళనకారులను అరెస్టు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. ఈ కేసుల గురించి న్యాయవాదులను సంప్రదిస్తున్నామని సౌరవ్ పేర్కొన్నారు. తమకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కేంద్రానికి మరోసారి గుర్తు చేస్తున్నట్లు తెలిపారు. రేపటిలోగా దేశవ్యాప్తంగా ఆందోళన కారులపై నమోదైన అన్ని కేసులు ఉపసంహరించు కోవాలని.. నిర్బంధంలో ఉన్న నిరసనకారులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే తమ తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని అన్నారు. ఈ విషయంలో కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు. నిరసనకారులపై నమోదైన అన్ని ఎఫ్ఐఆర్‌లను తక్షణమే ఉపసంహరించుకోవాలని, మరియు బీజేపీ పాలిత లేదా బీజేపీ ఢిల్లీ పోలీసులు, కేంద్ర దర్యాప్తు సంస్థలు లేదా పోలీసు బలగాలు కొత్త కేసులు నమోదు చేయకూడదని సీజేపీ డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో మళ్లీ నిరసనలో కూర్చుంటామని కేంద్రానికి అల్టిమేటం జారీ చేసింది. కేసులు ఎత్తేస్తామనే హామీని లిఖితపూర్వకంగా తమకు బుధవారం లోగా ఇవ్వాలని సీజేపీ కోరింది. సోమవారం నాడు సీనియర్ సుప్రీం కోర్టు న్యాయవాది మరియు ఎస్పీ రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్‌తో కలిసి నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో, సీజేపీ ప్రతినిధి సౌరవ్ దాస్ మాట్లాడుతూ, ప్రభుత్వం తమ డిమాండ్లను అంగీకరించిన తర్వాత జూలై 25న ఆందోళనను విరమించుకున్నామని, అయితే ఆందోళన తగ్గుముఖం పట్టిన కొద్దీ విద్యార్థులను ఒక్కొక్కరిగా లక్ష్యంగా చేసుకుంటారని తాము ముందే ఊహించామని తెలిపారు.

# విద్యార్థులకు క్షమాపణలు చెప్పాల్సిందే

### ఎక్స్ వేదికగా రాహుల్ గాంధీ డిమాండ్

**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా నిరసనలు చేపడుతున్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం, బీజేపీ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు అణచివేత ధోరణిని అవలంబిస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ మండిపడ్డారు. విద్యార్థులపై కాల్పులు, లాఠీఛార్జీలు, కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన ఆగ్రహించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెడుతూ కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఇందుకు క్షమాపణలు చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. బిహార్‌లో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై ఏకే-47తో కాల్పులు జరిపారని, వందలాది మంది విద్యార్థులను అరెస్టు చేసి వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారనే వార్తలు వస్తున్నాయని రాహుల్ గాంధీ అన్నారు. విద్యార్థులపై ఎలాంటి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయబోమని, వారిని విడుదల చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన హామీ ఏమైందని ఆయన



ప్రశ్నించారు. హామీకి విరుద్ధంగా వారిపై క్రూరమైన దాడులు జరుగుతున్నాయని మండిపడ్డారు. ఢిల్లీలో విద్యార్థులపై పె÷-లలెట్ గన్‌లు ప్రయోగించారని, బిహార్‌లో ఏకే-47తో కాల్పులు జరిగాయని రాహుల్ ఆరోపించారు. ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బిహార్, ఢిల్లీ.. రాష్ట్రం ఏదైనా విద్యార్థుల గొంతు నొక్కివేయాలనే ధోరణెళి కనిపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.కేంద్ర ప్రభుత్వం నిజాయతీ లేనిదని తాను గతంలోనే చెప్పానని, నిజమైన సంస్కరణలు తీసుకురావడం ఈ ప్రభుత్వానికి సాధ్యం కాదని రాహుల్ విమర్శించారు. ఇచ్చిన హామీల నుంచి వెనక్కి తగ్గడంతో పాటు, విద్యార్థుల గొంతు అణచివేసేందుకు అన్ని మార్గాలను ఉపయోగిస్తోందని చెప్పుకొచ్చారు. దేశంలోని విద్యార్థులందరికీ ప్రధాని మోదీ బహిరంగంగా క్షమాపణ చెప్పాలన్నారు. విద్యార్థులపై కేసులు పెట్టడం కాకుండా, వారిపై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. కాగా, జులై 25న బిహార్ బంద్ సందర్భంగా సివాన్ జిల్లాలో పోలీసులు ఏకే-47తో కాల్పులు జరిపినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఓ పోలీసు అధికారిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.

# విన్నర్లుగా ఇద్దరు భారత షూటర్లు



హాంగ్‌జౌలో జరుగుతున్న (ఇంటర్నేషనల్ షూటింగ్ స్పోర్ట్స్ ఫెడరేషన్?) ప్రపంచ కప్ 2026లో అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. 25 మీటర్ల పిస్టర్ ఈవెంట్? పోడియంపై ఇద్దరు భారత షూటర్లు విన్నర్లుగా నిలిచారు. సోమవారం జరిగిన మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో భారత షూటర్లు అద్భుత ప్రదర్శనను కొనసాగించారు. ఇందులో ఈషా సింగ్ అగ్రస్థానంలో నిలిచి స్వర్ణ పతకం ముద్దాడింది. ఒలింపిక్ పతక విజేత సీనియర్ షూటర్ మను భాకర్ మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం దక్కించుకుంది. ప్రపంచ రికార్డు హోల్డర్ ఈషా సింగ్ ఫైనల్‌లో ఆరంభం నుంచే ఆధిపత్యం ప్రదర్శించింది. ఆమె పోటీ అంతటా అద్భుతమైన ప్రదర్శన కనబరిచి, 50 షాట్‌లకు 40 పాయింట్లు సాధించింది. దీంతో ఆమె స్వర్ణ పతకం దక్కించుకుంది. 37 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచిన ఆతిథ్య చైనా షూటర్ యూ జాంగ్‌ను రజత పతకం గెలుచుకుంది. ఇక రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత అయిన మను భాకర్ కూడా ఈ పోటీలో ఫేవరెట్?గా దిగింది. అయితే ఆమె స్వర్ణం కోసం పోరాడగా, కాంస్యంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. కాంస్య పతకం కోసం జరిగిన మ్యాచ్‌లో ఆమె ఉత్తర కొరియాకు చెందిన హ్యోన్ జియోంగ్ పాక్‌ను ఎదుర్కొంది. డబుల్ షూట్ ఆఫ్‌లో హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో మను భాకర్ నెగ్గింది. దీంతో ఈ వరల్డ్?కప్?లో భారత్ పతకాల సంఖ్య మూడుకు చేరింది. ఈ విజయంపై కేంద్ర క్రీడల మంత్రి మన్?సుఖ్ మాండవియా హర్షం వ్యక్తం చేశారు. 'పోడియంపై భారత షూటర్లు. ఈ పోటీల్లో స్వర్ణం సాధించిన ఈషాకు, కాంస్యం దక్కించుకున్న మను భాకర్?కు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. మీ పట్ల భారతదేశం గర్వపడుతోంది' అని ఎక్స్?లో పోస్టు చేశారు.కాగా, ఈ సీజన్‌లో హాంగ్‌జౌలో ఈషా సింగ్‌కు ఇది రెండో ప్రపంచ కప్ స్వర్ణ పతకం కావడం విశేషం. ఆమె ఈ పోటీకి ముందు మే నెలలో జరిగిన మ్యూనిచ్ ప్రపంచ కప్‌లో 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో గోల్డ్ మెడల్ గెలుచుకుంది. అదే పోటీల్లో 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లోనూ సత్తా చాటి రజత పతకాన్ని కూడా ముద్దాడింది. మరోవైపు, మను భాకర్‌కు ఈ సీజన్‌లో ఇదే వ్యక్తిగతంగా మొదటి పతకం. 2026లో ఆమె మ్యూనిచ్ ప్రపంచ కప్‌లో మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో పతకం సాధిచింది.హాంగ్‌జౌ ప్రపంచ కప్‌లో ఇప్పటివరకు ఆతిథ్య చైనా ఆరు స్వర్ణాలతో సహా 14 పతకాలను గెలుచుకొని పతకాల పట్టికలో అగ్రస్థానంలో ఉంది. భారత్ మూడు పతకాలతో రెండో స్థానంలో కొనసాగుతోంది. తాజాగా ఇషా సింగ్ స్వర్ణం, మను భాకర్ కాంస్యం నెగ్గగా, ఈ ఇద్దరికంటే ముందు సైనియం 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్?లో రజత పతకం దక్కించుకుంది. ఈ పోటీల్లో భారత షూటర్ల ప్రస్తుత ప్రదర్శన రాబోయే రోజుల్లో అంతర్జాతీయ స్థాయిలో పోటీలు, ప్రధాన టోర్నమెంట్‌లపై అంచనాలను పెంచుతోంది.



## వెయిట్‌లిఫ్టర్ జ్ఞానేశ్వరి యాదవ్‌కు రజతం

కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్ ఖాతాలో ఐదో పతకం చేసింది. వెయిట్‌లిఫ్టర్ జ్ఞానేశ్వరి యాదవ్ సిల్వర్ మెడల్ సాధించింది. సోమవారం జరిగిన మహిళల 53 కేజీల విభాగం వెయిట్‌లిఫ్టింగ్‌లో రెండో స్థానంలో నిలిచిన జ్ఞానేశ్వరికి రజతం దక్కింది. ఈ పోటీలో తొలి స్థానంలో నిలిచిన ఒనోమి ఒమోలోల (నైజీరియా) గోల్డ్ ముద్దాడగా, రెబెక (కెనడా)కు కాంస్యం దక్కింది. ఈ పోటీలో జ్ఞానేశ్వరి అద్భుత పోరాట పటిమ కనబర్చింది. అయితే కేవలం 7 పాయింట్ల తేడాతో ఆమె స్వర్ణం మిస్ అయ్యింది. స్నాచ్‌లో తొలి రెండు ప్రయత్నాల్లో 82, 85 కేజీల బరువు ఎత్తిని యాదవ్ మూడో ప్రయత్నంలో సక్సెస్‌ఫుల్‌గా 88 కేజీలు ఎత్తింది. ఇక క్లీన్ అండ్ జెర్క్‌లో తొలి రెండుసార్లు 103, 105 కేజీలు ఎత్తగా, చివరి ప్రయత్నంలో 111 కేజీలు బరువుతో సత్తా చాటింది. దీంతో మొత్తం 199 కేజీలతో జ్ఞానేశ్వరి రెండో స్థానంలో నిలిచింది. ఇదే పోటీలో నైజీరియా వెయిట్ లిఫ్టర్ ఒనమి ఒనోమోల స్నాచ్‌లో ఏకంగా 93 కేజీలు ఎత్తింది. ఇక ఇక క్లీన్ అండ్ జెర్క్‌లోనూ సత్తా చాటుతూ 113 కేజీలు ఎత్తింది. మొత్తం స్కోర్ 206 కేజీలు నమోదు చేసిన ఒనోమోల గోల్డ్ మెడల్ పట్టేసింది.



## రాజా ముత్తుపాండికి రజతం

కామన్వెల్త్ గేమ్స్-2026లో భారత వెయిట్‌లిఫ్టర్లు తమ సత్తా చాటుతున్నారు. ఆదివారం జరిగిన పురుషుల 65 కేజీల విభాగంలో భారత వెయిట్‌లిఫ్టర్ రాజా ముత్తుపాండి రజత పతకం సాధించాడు. స్నాచ్, క్లీన్ అండ్ జర్క్ విభాగాల్లో కలిపి 286 కేజీలు ఎత్తి రెండో స్థానంలో నిలిచాడు. దీంతో గ్లాస్గోలో భారత్‌కు ఆ రోజే వెయిట్‌లిఫ్టింగ్‌లో మూడో పతకం లభించింది. తమిళనాడుకు చెందిన 26 ఏళ్ల రాజా ముత్తుపాండి స్నాచ్‌లో 126 కేజీలు, క్లీన్ అండ్ జర్క్‌లో 160 కేజీలు విజయవంతంగా ఎత్తాడు. రెండు విభాగాల్లో కలిపి 286 కేజీల మొత్తం బరువుతో రజత పతకాన్ని ఖాయం చేసుకున్నాడు. విభాగంలో మలేషియాకు చెందిన అజ్నిల్ బిన్ బిడిన్ మహ్మద్ మొత్తం 299 కేజీలు ఎత్తి కామన్వెల్త్ గేమ్స్ రికార్డుతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. వరుసగా మూడోసారి కామన్వెల్త్ గేమ్స్ స్వర్ణాన్ని గెలుచుకున్న ఘనత కూడా అతని ఖాతాలో చేరింది. రాజా ముత్తుపాండి విజయానికి వెనక సుదీర్ఘ పోరాటం ఉంది. 2019లో మోచేతి లిగమెంట్‌కు తీవ్రమైన గాయం కావడంతో అతని కెరీర్ సంక్షోభంలో పడింది. అనంతరం కరోనా మహమ్మారి కారణంగా పునరావాస ప్రక్రియ కూడా దెబ్బతింది. అంతేకాకుండా కొత్త బరువు విభాగాలకు మార్పు, భారత స్టార్ వెయిట్‌లిఫ్టర్ జెరెమీ లాల్?రిన్నుంగా ఎదుగుదలతో 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌కు ఎంపిక కాలేకపోయాడు. అయితే 65 కేజీల విభాగం ప్రవేశపెట్టిన తర్వాత మళ్లీ జాతీయ జట్టులో చోటు సంపాదించాడు. 2025 ప్రపంచ వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శనగా 299 కేజీలు ఎత్తి తొమ్మిదో స్థానంలో నిలవడం అతనికి ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ఇప్పుడు అదే జోరును కొనసాగిస్తూ కామన్వెల్త్ గేమ్స్‌లో రజత పతకాన్ని గెలుచుకున్నాడు. ఈ విజయాన్ని తల్లిదండ్రులు, కోచ్ విజయ్ శర్మకు అంకితం చేస్తానని రాజా ముత్తుపాండి తెలిపాడు. అయితే స్వర్ణ పతకాన్ని అందుకోలేకపోవడం తనకు నిరాశ కలిగించిందని తెలిపాడు. కోచ్? తనపై పూర్తి విశ్వాసం ఉంచారని, కానీ ఆశించిన స్థాయిలో ప్రదర్శన ఇవ్వలేకపోయానని అన్నాడు. అయితే ఈ పోటీ నుంచి నేర్చుకున్న పాఠాలతో మరింత కష్టపడి శిక్షణ తీసుకుని భవిష్యత్తులో స్వర్ణం సాధించేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశాడు. ఆదివారం భారత పతకాల ఖాతాలో చేరిన మూడు పతకాలు కూడా వెయిట్‌లిఫ్టింగ్ నుంచే రావడం విశేషం. అంతకుముందు మహిళల 48 కేజీల విభాగంలో ఒలింపిక్ రజత పతక విజేత మీరాబాయి చాను వరుసగా మూడోసారి కామన్వెల్త్ గేమ్స్ స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. అలాగే పురుషుల 60 కేజీల విభాగంలో చనాంబం రిషికాంతా సింగ్ రజత పతకం సాధించి భారత్‌కు మరో విజయాన్ని అందించాడు. దీంతో వెయిట్‌లిఫ్టింగ్ మరోసారి భారత పతకాల వేటలో కీలక పాత్ర పోషించింది.మరోవైపు బాక్సింగ్‌లో భారత్‌కు తొలి నిరాశ ఎదురైంది. పురుషుల విభాగంలో పోటీపడిన ఆదిత్య ప్రతాప్ యాదవ్ ప్రీక్వార్టర్ ఫైనల్లో ఉగాండాకు చెందిన నుహు బట్టే చేతిలో 3-2 తేడాతో ఓడిపోయాడు. దీంతో గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్‌లో భారత బాక్సింగ్ జట్టుకు తొలి ఓటమి నమోదైంది.

### జింబాబ్వే పర్యటనలో ఘోరంగా ఆడడంపై

## అభిషేక్ శర్మ భావోద్వేగ స్పందన

టీమిండియా యువ విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ తీవ్ర ఫామ్ లేమితో సతమతమవుతున్నాడు. జింబాబ్వేతో ముగిసిన మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో దారుణంగా విఫలమవ్వడంపై తొలిసారిగా మౌనం వీడాడు. తన ప్రదర్శన పట్ల తీవ్ర నిరాశను వ్యక్తం చేస్తూ, బలంగా పునరాగమనం చేస్తానని ధీమా వ్యక్తం చేశాడు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఒక భావోద్వేగ పోస్ట్ పెట్టాడు. జింబాబ్వే పర్యటనలో టీమిండియా 3-0 తేడాతో సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసి సత్తా చాటింది. ఈ సిరీస్‌లో 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అద్భుత ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించాడు. మూడు మ్యాచ్‌ల్లో వరుసగా 50 (18 బంతుల్లో), 20 (9 బంతుల్లో), 81 (49 బంతుల్లో) పరుగులు చేసి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచాడు. అయితే, అతని ఓపెనింగ్ భాగస్వామి అభిషేక్ శర్మ మాత్రం పూర్తిగా తేలిపోయాడు. మూడు మ్యాచ్‌ల్లో వరుసగా 1, 8, 2 పరుగులు మాత్రమే చేసి తీవ్రంగా నిరాశపరిచాడు. అభిషేక్ వైఫల్యం కేవలం ఈ సిరీస్‌కే పరిమితం కాలేదు. గత ఆరు టీ20 మ్యాచ్‌లను పరిశీలిస్తే, అతని స్కోర్లు 10, 16, 3, 1, 8, 2గా ఉన్నాయి. ఒకప్పుడు బౌలర్లపై విరుచుకుపడే అభిషేక్, ప్రస్తుతం పరుగులు చేయడానికి తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాడు. సిరీస్ ముగిసిన అనంతరం తన వైఫల్యంపై అభిషేక్ శర్మ ఇన్‌స్టాగ్రామ్‌లో స్పందించాడు. "ప్రజలు మీపై ఎంతో నమ్మకం పెట్టుకున్నప్పుడు, దాన్ని నిలబెట్టుకోలేకపోతే చాలా బాధగా ఉంటుంది. అయితే, పట్టు వదలకుండా ప్రయత్నించే వారికి ఈ ఆట ఎప్పుడూ ప్రతిఫలం ఇస్తుంది. జట్టు సిరీస్ గెలిచినందుకు సంతోషంగా ఉంది. మరింత బలంగా తిరిగొస్తాను" అని రాసుకొచ్చాడు. ఒకవైపు అభిషేక్ ఫామ్ కోల్పోవడం, మరోవైపు



వైభవ్ సూర్యవంశీ అరంగేట్రంతోనే అదరగొట్టడం, అలాగే టీ20 ప్రపంచకప్‌లో రాణించిన సంజూ శాంసన్ వంటి ఆటగాళ్లు అవకాశాల కోసం ఎదురుచూస్తుండటంతో ఓపెనింగ్ స్థానానికి పోటీ తీవ్రమైంది. భారత జట్టుకు తదుపరి టీ20 సిరీస్‌లు సెప్టెంబర్‌లో ఆసియా క్రీడలు, అక్టోబర్‌లో వెస్టిండీస్‌తో ఉన్నాయి. ఈ విరామ సమయంలో తన బలహీనతలను అధిగమించి, తిరిగి ఫామ్‌లోకి రావడానికి అభిషేక్‌కు మంచి అవకాశం లభించినట్లయింది. తనదైన దూకుడైన శైలితో మళ్లీ పరుగుల వరద పారించాలని అభిమానులు ఆశిస్తున్నారు.

## వన్డేల్లో టీమిండియాకు కొత్త ఓపెనర్

### 15 ఏళ్ల కుర్రాడికి ఛాన్స్ ఇవ్వాలన్న మాజీ క్రికెటర్

2027 వన్డే ప్రపంచకప్‌ను లక్ష్యంగా చేసుకుని భారత జట్టులో కీలక మార్పులు చేయాల్సిన సమయం ఆసన్నమైందని టీమిండియా మాజీ వికెట్ కీపర్, బ్యాటర్ ఫరూక్ ఇంజనీర్ అభిప్రాయపడ్డాడు. యువ సంచలనం, 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీని వెంటనే వన్డే జట్టులోకి తీసుకుని, కెప్టెన్ రోహిత్ శర్మతో కలిసి ఓపెనర్‌గా పంపాలని సూచించాడు. ప్రస్తుత ఓపెనర్ శుభ్‌మన్ గిల్‌ను నాలుగో స్థానానికి పంపిస్తే మిడిల్ ఆర్డర్ మరింత పటిష్ఠంగా మారుతుందని ఫరూక్ పేర్కొన్నాడు. పీటీఐతో మాట్లాడుతూ ఫరూక్ ఇంజనీర్ ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. "నా దృష్టిలో ఆదర్శవంతమైన బ్యాటింగ్ లైనప్ అంటే.. రోహిత్ శర్మ, వైభవ్ సూర్యవంశీ ఓపెనింగ్ చేయాలి. దీనివల్ల లెఫ్ట్-రైట్ కాంబినేషన్ కుదురుతుంది. విరాట్ కోహ్లీ మూడో స్థానంలో, శుభ్‌మన్ గిల్ నాలుగో స్థానంలో రావాలి. గిల్ ఒక క్లాస్ ప్లేయర్. ప్రస్తుతం జట్టులో అత్యుత్తమ బ్యాటర్ అతనే. కానీ, అతను బంతిని ఎక్కువగా గాల్లోకి లేపే రకం కాదు. అందుకే మిడిల్ ఆర్డర్‌లో నాలుగో స్థానం అతనికి సరిగ్గా సరిపోతుంది. సూర్యవంశీ లాంటి బ్యాటర్ ఓపెనింగ్ చేస్తే, ఫీల్డ్‌లోని గ్యాప్స్‌ను చక్కగా ఉపయోగించుకుంటాడు" అని వివరించాడు. ఇటీవల జింబాబ్వేతో ముగిసిన సిరీస్‌లో రెండు అర్ధ సెంచరీలతో 151 పరుగులు చేసి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు గెలుచుకున్న వైభవ్ సూర్యవంశీని వన్డే జట్టులోకి తీసుకోవడానికి ఇదే సరైన సమయమని ఫరూక్ ఇంజనీర్ అన్నాడు. "వన్డే, టీ20 ఫార్మాట్లకు ప్రజలు ఎందుకు అంత తేడా చూస్తారో నాకు అర్థం కాదు. సూర్యవంశీకి ఆత్మవిశ్వాసం ఉంది. అతను జట్టుకు మ్యాచ్‌లు గెలిపిస్తాడు. అతను మంచి ఆరంభం ఇస్తే, మిగతా బ్యాటర్లు ఇన్నింగ్స్ నిర్మించడానికి తగినంత సమయం దొరుకుతుంది" అని పేర్కొన్నాడు. వైభవ్ సూర్యవంశీ ఒక మేధావి అని, అతడిని అతిగా కోచింగ్ చేసి పాడుచేయొద్దని ఫరూక్ ఇంజనీర్ హెచ్చరించాడు. "కొద్దిగా షార్ట్ ఆఫ్




లెంగ్త్ పడినా సూర్యవంశీ దానిని సిక్సర్‌గా మలచగలడు. అతను తన తప్పుల నుంచి నేర్చుకున్నాడు. వెస్టిండీస్ దిగ్గజం వివ్ రిచర్డ్స్ కూడా ఇలాంటి వాడే. నేను చూసిన అత్యుత్తమ బ్యాటర్ వివ్. సూర్యవంశీకి అండగా నిలవండి, అతడు భవిష్యత్తులో భారత జట్టుకు ఒక గొప్ప ఆస్తి అవుతాడు" అని ఫరూక్ ఇంజనీర్ స్పష్టం చేశాడు.

# ఆదర్శకుటుంబంలో చిట్టిబాబు గ్లింప్స్ విడుదల



టాలీవుడ్ యాక్టర్ వెంకటేశ్, స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో వస్తున్నచిత్రం 'ఆదర్శ కుటుంబం' వెంకీ 77వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను గాంధీ జయంతి సందర్భంగా, అక్టోబర్ 2వ తేదీన ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారని తెలిసిందే. ప్రతి కుటుంబం గుర్తుపెట్టుకోవాల్సిన తేదీ.. అక్టోబర్ 2న ఆదర్శ కుటుంబం తలుపులు తెరుచుకోబోతున్నాయి..అంటూ మేకర్స్ హైప్ పెంచేస్తున్నారు. తాజాగా ప్రమోషన్స్‌లో భాగంగా వెంకీ పోషిస్తున్న చిట్టిబాబు పాత్ర గ్లింప్స్‌ను షేర్ చేశారు. కిచెన్‌లో ఏసీనా.. నాన్న నువ్వు వంట చేసేటప్పుడు హ్యాపీగా ఏసీ వేసుకుని చేసుకోవచ్చు. అవును నేను మ్యాన్ ఆఫ్ ది హౌస్. వాషింగ్ మెషిన్ కూడా ఉంది.. నీకు పని బాగా తగ్గిపోయినట్టేనని శ్రీనిధి శెట్టి అంటున్న డైలాగ్స్‌తో షురూ అయింది గ్లింప్స్. చిట్టిగారు అని రఘుబాబు అంటుంటే అస్తమానం తలతిప్పకండి బుజ్జిగారు మెడ పట్టేస్తుంది.. నాకు ఎవరేం పని చేసినా నచ్చదు. అందుకే అన్నీ నేనే చూసుకుంటానంటున్నాడు వెంకీ.. ఆదర్శ కుటుంబం అంటూ నారా రోహిత్ డైలాగ్స్‌తో ఎండ్ అయింది గ్లింప్స్. మొత్తానికి చిట్టిబాబుగా వెంకీ అండ్ ఫ్యామిలీ పక్కా వినోదాన్నిఅందించబోతుందని తాజా గ్లింప్స్ చెప్పకనే చెబుతోంది. ఈ చిత్రంలో కేజీఎఫ్ ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై సూర్యదేవర రాధాకృష్ణ (చినబాబు), వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీకి స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ థమన్ సంగీతం అందిస్తున్నాడు. వెంకటేష్, త్రివిక్రమ్ కాంబోలో వస్తున్న మొదటి ఫుల్ లెంగ్త్ సినిమా కావడంతో అంచనాలు భారీగానే నెలకొన్నాయి.

# త్వరలోనే రాకా షూటింగ్‌లోకి అల్లు అర్జున్




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్,స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక పాన్-ఇండియా చిత్రం రాకా పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. కొత్త షూటింగ్ షెడ్యూల్‌కు సంబంధించిన ఆసక్తికరమైన వార్త సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. తాజా సమాచారం ప్రకారం, చిత్రబృందం త్వరలో ప్రారంభం కానున్న కొత్త షెడ్యూల్‌లో అల్లు అర్జున్ ఇంట్రడక్షన్ సీన్ చిత్రీకరించనుంది. ఈ సీన్‌ను సినిమాకే హైలైట్‌గా నిలిచేలా అత్యంత భారీ స్థాయిలో ఎ÷-లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ ఎపిసోడ్ కోసం ప్రత్యేకంగా భారీ సెట్‌ను నిర్మించినట్లు సమాచారం. అట్లీ మార్క్ స్టైలిష్ విజువల్స్, హై వోల్టేజ్ యాక్షన్‌తో బన్నీ ఎంట్రీ ప్రేక్షకులకు గూస్‌బంప్స్ ఇచ్చేలా ఉండబోతుందనే టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రంలో అల్లు అర్జున్ ఇప్పటివరకు కనిపించని వైల్డ్ అండ్ రగ్గడ్ లుక్లో కనిపించనున్నారని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా ఇంట్రడక్షన్ సీన్‌లో ఆయన మేకోవర్, బాడీ లాంగ్వేజ్, యాక్షన్ స్టైల్ అభిమానులను ఆశ్చర్యపరిచేలా ఉంటాయని సమాచారం. 'పుష్ప' తర్వాత మరోసారి పూర్తిగా భిన్నమైన పాత్రలో బన్నీ కనిపించనున్న నేపథ్యంలో ఈ సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. 'రాకా'లో హీరోయిన్‌గా బాలీవుడ్ స్టార్ దీపికా పదుకొణె నటిస్తున్న సంగతి తెలిసిందే. ఆమెతో పాటు మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారని ప్రచారం జరుగుతోంది. ముగ్గురు స్టార్ హీరోయిన్లు ఒకే సినిమాలో భాగం కావడం ఈ ప్రాజెక్ట్‌కు మరో ప్రత్యేక ఆకర్షణగా మారింది. సినీ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, 'రాకా' కథ మాఫియా ప్రపంచం చుట్టూ తిరుగుతుందని తెలుస్తోంది. ఓ శక్తివంతమైన డాన్ జీవితాన్ని కేంద్రంగా చేసుకుని యాక్షన్, ఎమోషన్స్, థ్రిల్లింగ్ మలుపులతో కథ సాగనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అట్లీ తన గత చిత్రాల మాదిరిగానే కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు భారీ విజువల్ ట్రీట్‌ను అందించేందుకు సిద్ధమవుతున్నారని సమాచారం. ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తోంది.

# ట్రెండీ అవుట్ ఫిట్‌తో పూజా హెగ్డే గ్లామర్ లుక్!



ఒక లైలా కోసం అనే చిత్రంతో తెలుగు ప్రేక్షకులను పలకరించిన పూజా హెగ్డే గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. అందం, అభినయంతో, నటనతో ఆకట్టుకుంటున్న ఈ పొడుగు కాళ్ళ సుందరి.. ముఖ్యంగా త్రివిక్రమ్ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా నటించిన అల వైకుంఠపురం సినిమాలో హీరోయిన్ గా నటించి.. బుట్ట బొమ్మగా మరింత పాపులారిటీ సొంతం చేసుకుంది ..ఆ తర్వాత నటించిన దువ్వాడ జగన్నాథం సినిమా కూడా ఈమెకు మంచి ఇమేజ్ అందించింది. వరుసగా అవకాశాలు అందుకుంటున్న సమయంలోనే.. కథల ఎంపిక విషయంలో కాస్త తడబడ్డ పూజా హెగ్డే.. మళ్లీ ఆ ఫ్లాప్ ల నుండి తేరుకోవడం లేదు. ఈమె నటించిన ప్రతి సినిమా కూడా డిజాస్టర్ గా నిలుస్తుండడంతో చాలామంది ఈమెపై ఐరన్ లెగ్ ముద్ర వేశారు. ఇకపోతే సినిమాలలో ఫ్లాప్ అందుకుంటున్నప్పటికీ ఇటు సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్ గా ఉంటూ సరికొత్త గ్లామర్ టచ్ తో ఆడియన్స్ లో కొత్త జోష్ నింపుతోంది పూజా హెగ్డే. అందులో భాగంగానే తాజాగా మరో ట్రెండీ అవుట్ ఫిట్ తో ఆడియన్స్ ముందుకు వచ్చింది. ఇంస్టాగ్రామ్ వేదికగా షేర్ చేసిన ఈ లేటెస్ట్ అవుట్ ఫిట్ ఫోటోషూట్ అభిమానులను విపరీతంగా అలరిస్తోంది. తాజాగా పూజా హెగ్డే తన ఇంస్టాగ్రామ్ ఖాతా ద్వారా షేర్ చేసిన లేటెస్ట్ ఫోటోషూట్ విషయానికి వస్తే.. బ్రౌన్ కలర్ టూ పీస్ కో ఆర్డ్ సెట్ ధరించింది. స్లక్చర్ ఫ్లస్ టాప్ కి దీనికి సరిగ్గా సరిపోయే వేస్టెడ్ వైడ్ లెగ్ ట్రౌజర్ తో తన మేకోవర్ ను ఫుల్ ఫిల్ చేసుకుంది. ముఖ్యంగా ఈమె ధరించిన టాప్ విషయానికి వస్తే.. టాప్ మధ్యలో డివైడ్ చేసినట్టు డిజైన్ చేసిన ఓవర్ ల్యాప్ పెప్లం గల స్ట్రాప్ లెస్ బ్యాండ్యూ సిల్హౌట్ టాప్ ను ధరించింది. బాటమ్ హై రైజ్, రిలాక్స్డ్ వైడ్ లెగ్ ప్యాంటు ఈమె అందాన్ని రెట్టింపు చేసింది. పైగా ఈ ఔట్ఫిట్ కి కాంబినేషన్ లో హై హీల్ ధరించింది ఈ ముద్దుగుమ్మ. బరువైన బంగారు గొలుసు, చౌకర్ నెక్లెస్ తో చాలా అందంగా సింపుల్ గా కనిపించింది.. ఇక పూజ హెగ్డే ధరించిన ఈ సింపుల్ ట్రెండీ ఔట్ ఫిట్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటుంది.

# పొలిమేర-3లో అర్జున్



టాలీవుడ్‌లో హారర్, మిస్టరీ థ్రిల్లర్ జానర్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న 'పొలిమేర' ఫ్రాంచైజీ ఇప్పుడు మూడో భాగంతో ప్రేక్షకుల ముందుకు రానుంది. మొదటి భాగం ఓటీటీలో సంచలన విజయాన్ని నమోదు చేయగా, రెండో భాగం థియేటర్లలో భారీ వసూళ్లు సాధించి ఈ ఫ్రాంచైజీని మరో స్థాయికి తీసుకెళ్లింది. ఇప్పుడు 'పొలిమేర 3' పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్న వేళ, చిత్రబృందం ప్రకటించిన తాజా అప్‌డేట్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. మూడో భాగంలో సీనియర్ నటుడు, 'యాక్షన్ కింగ్' అర్జున్ సర్జా కీలక పాత్రలో నటిస్తున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రత్యేక ప్రమోషనల్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అర్జున్ ఎంట్రీతో 'పొలిమేర 3' కథ మరింత విస్తృతంగా, భారీ స్థాయిలో ఉండబోతుందనే సంకేతాలు కనిపిస్తున్నాయని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. హారర్, మిస్టరీతో పాటు యాక్షన్ అంశాలు కూడా ఈసారి మరింత బలంగా ఉండనున్నాయనే చర్చ సాగుతోంది. దర్శకుడు అనిల్ విశ్వనాథ్ తెరకెక్కించిన 'మా ఊరి పొలిమేర' ఎలాంటి అంచనాలు లేకుండా నేరుగా ఓటీటీలో విడుదలై ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. గ్రామీణ నేపథ్యంలో మంత్రతంత్రాలు, చేతబడులు, మూఢనమ్మకాల చుట్టూ తిరిగే కథ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇచ్చింది. ఈ సినిమాతో హాస్యనటుడు సత్యం రాజేష్ పూర్తి స్థాయి హీరోగా, నటుడిగా ప్రశంసలు అందుకున్నారు. ఆయన నటన, కథలోని ట్విస్టులు, థ్రిల్లింగ్ అంశాలు సినిమాను ప్రత్యేకంగా నిలబెట్టాయి. మొదటి భాగం విజయంతో ఉత్సాహంగా రెండో భాగాన్ని థియేటర్ల కోసం భారీ స్థాయిలో రూపొందించారు. 'పొలిమేర 2' విడుదల తర్వాత ప్రేక్షకుల నుంచి అద్భుత స్పందన లభించింది. మిస్టరీ, హారర్, భావోద్వేగాల మేళవింపుతో తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధించి నిర్మాతలకు లాభాలను తెచ్చిపెట్టింది.ఇప్పుడు మూడో భాగం గత రెండు చిత్రాల కంటే మరింత భారీ స్థాయిలో రూపొందుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల విడుదలైన 'బ్లాస్ట్' చిత్రంతో అర్జున్ సర్జా మరోసారి తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

# సెప్టెంబర్‌లో మహేంవద్రగిరి వారహి




సుమంత్ హీరోగా సంతోష్ జాగర్లమూడి ప్రధానపాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం 'మహేంద్రగిరి వారాహి' సోషియో ఫాంటసీ చిత్రాన్ని సెప్టెంబర్ 11న విడుదల చేయనున్నట్లు టీమ్ వెల్లడించింది. ఈ సినిమా కోసం రెండున్నరేళ్లు చర్చలు జరిగినట్లు సుమంత్ తెలిపారు. మధ్యలో ఈ సినిమా సందిగ్ధంలో పడిందని గుర్తుచేసుకున్నారు. ఇందులో ట్విస్ట్‌లు చాలా ఉన్నాయని తెలిపారు. ఓ స్టార్ హీరో దాదాపు 20 నిమిషాలు కనిపిస్తారని నిర్మాత మధు వెల్లడించారు. కథ నచ్చడంతో వెంటనే ఓకే చేశారు. వారాహి అమ్మవారిగా నటించారా లేదా.. మరేదైనా పాత్రలో కనిపిస్తారా అనేది స్క్రీన్‌పై చూసి తెలుసుకోవాలి. సంతోష్‌కు ఆధ్యాత్మికత, చరిత్ర గురించి చాలా విషయాలు తెలుసు. మొదట అనుకున్న కథలో కొన్ని మార్పులు చేసి దీన్ని రూపొందించాం. ఇందులో నటించడం చాలా ఆసక్తిగా అనిపిస్తోంది.

PRINTED, PUBLISHED & OWNED By Rolla Raghunath Reddy, PRINTED at Teja Cards & Stationery (Printing & Stationery Supplyers) #78-1-26, Thunnuguntla Vari Street Lalapeta, Guntur - 522001.
EDITOR : Rolla Raghunath Reddy, #4-6-13, Library Road, Koritipadu 1st Lane, Near RCM School, Chandramoulinagar Guntur - 522007. Andhra Pradesh. E-mail: bharathprathinidhi@gmail.com Phone No: 8121214342